

భారీ వర్షాలకు దెబ్బతిన్న పత్తి(ఫైల్)

పత్తి దిగుబడిపై దిగులు

- అధిక వర్షాలకు నిలిచిన మొక్కల ఎదుగుదల
- పది వేల ఎకరాల్లో పంట నష్టం
- ప్రకృతి వైపరీత్యాలకు కుదేలవుతున్న రైతు
- పరిహారం అందించాలని అన్నదాతల వినతి

ఆసిఫాబాద్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించే రైతున్నకు ఏటేటా కష్టాలు తప్పడం లేదు. ప్రకృతి వైపరీత్యాలకు అన్నదాతలు విలవిలలాడుతున్నారు. అతివృష్టి, అనావృష్టితో ఏటా ఏదో ఒక రూపంతో జిల్లా రైతాంగం అత లాకుతలమవుతోంది. ఏటేటా పంట సాగు ఖర్చులు పెరుగుతున్నప్పటికీ గిట్టుబాటు ధర లభించక పోవడంతో రైతాం గం తీవ్రంగా నష్ట పోవాల్సి వస్తుంది. దీంతో రైతులు అప్పుల పాలవుతున్నారు. ఈ ఏడాది వానాకాలం సీజన్ ప్రారంభంలో విత్తనాలు విత్తిన రైతన్నలు పంటల దిగుబడి పై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఈసారైన పంటలు ఆశించిన స్థాయిలో పండుతాయని బావించిన రైతాంగానికి తీవ్ర నిరాశే ఎదురైంది. ఎక దాటిగా వర్షాలు కురుస్తునే ఉండ డంతో వేసిన పంట లు ఎదుగుదల లేక రైతన్నలు దిగాలు చెందు తు న్నారు. జిల్లాలో కురిసిన భారీ వర్షాల కారణంగా సు మారు పదివేల ఎకరాలలో పత్తి పంటకు నష్టం వాటిల్లింది. జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో 4,45,04 9 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతున్నా యి. ఇందులో పత్తి 3,35,363 ఎకరాలు, వరి పంట 56, 861 ఎకరాలు, కంది పంట 30,430 సాగవుతుంది. మొక్కజొన్న, జొన్న, పెసర, మిను ములు, సోయబీన్, మిరప, వేరు శెనగ, ఆముదాలు,నువ్వులు 22,395 ఎక రాలలో పంటలను రైతులు సాగు చేస్తున్నారు. జిల్లా లో ప్రతి ఏటా రైతులు పత్తిపంట వైపే మొగ్గు చూపు తున్నారు. ఈ ఏడాది అధిక వర్షాల కారణంగా పత్తి పంట సాగుచేస్తున్న రైతాంగానికి తీవ్రనష్టం వాటిల్లింది.



నీట మునిగిన పత్తి పంట(ఫైల్)

● భారీ వర్షాలకు..

ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. జిల్లాలో పెద్ద ఎత్తున పత్తి పంటను సాగు చేసిన రైతులను భారీ వర్షాలు తీవ్రంగా నష్టానికి గురి చేశాయి. జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలకు పదివేల ఎకరాలలో పత్తి పంటకు నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనాలు వేశారు. కొన్ని మండలాలలో ఎకదాటిగా కురిసిన వర్షాలకు పంటలు నీట మునిగాయి. నది పరివాహక ప్రాంతాలలోని పంటచేలలో ఇసుక మేటలు వేశాయి. వర్షాలతో పంటచేలలో నీరు నిలువ ఉండడంతో మొక్కలు కుళ్లిపోయి పంట ఎదుగుదల నిలిచిపోయింది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. పత్తిపంట సాగుచేస్తున్న రైతాంగానికి కలుపు తీయడానికి కూడా వీలు లేకుండా పోయింది. దీంతో ఏపుగా పెరిగిన కలుపుతో పంట ఎదుగుదల తగ్గిందని రైతులు వాపోతున్నారు.

● ఎగువ నుంచి వరద..

జిల్లాలో కురిసిన భారీ వర్షాలతో పాటు ఎగువన మహారాష్ట్రలో కురిసిన వర్షాలకు పెనుగంగా, ప్రాణ హిత, పెద్దవాగులకు వరద పోటెత్తడంతో ఉగ్ర రూపం దాల్చి అతలాకుతలం చేశాయి. జిల్లాలోని పెనుగంగా, ప్రాణహిత,పెద్దవాగు సరిహద్దు పరివాహక మండలా లైన కౌటాల. చింతలమానేపలి, బెజ్జూర్, పెంచికలపే ట్, దహెగాంలలో వేల ఎకారాలలో పంట నష్టం వాటిల్లింది. వరదల కారణంగా పంట పొలాలు వరద నీటిలో మునిగి పోయాయి. కొన్ని చోట్ల ఇసుక మేట లు వేశాయి. మరికొన్ని చోట్ల పంటలు కొట్టుకుపోయి ఎడారిలా మారాయి. సిర్పూర్ నియోజకవర్గంలో ఏటా వర్షాకాలంలో ప్రాణహిత. పెనుగంగా, పెద్దవాగు పరీవాహక ప్రాంతాల్లో వరదలు పంటలను ముంచెత్తుతునే ఉన్నాయి. మహారాష్ట్రలో వర్షాలు కురిసినా, అ క్కడి ప్రాజెక్టుల నీటిని వదిలినా ప్రాణహిత పరివాహక మండలాల్లో తీవ్ర పంట నష్టం జరుగుతోంది. దీంతో రైతులు నష్టాల పాలవుతు న్నారు. నాలుగైదే ళ్లుగా పంటలు నష్టపోయిన వారికి పరిహారం రాలేద ని రైతులు వాపోతున్నారు.

పంటలు దెబ్బతిన్నాయి..



- సంజీవ్ , రైతు

పత్తి మొలకెత్తె దశ నుంచి మొదలుకొని మొక్కలు పెరిగే దశ వరకు భారీ వర్షాలు కురువడంతో పంట తీవ్రంగా దెబ్బతిన్నది. కొన్ని చోట్ల పంట చేలలో రోజుల తరబడి వరదనీరు నిలిచి ఉండడంతో మొక్క లు కుళ్లిపోయాయి. దీంతో పెట్టుబడులు సైతం రావ డం కష్టంగా ఉంది. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

జైనూర్ , సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుకుడ్‌పెల్లి పాఠశాల ఉపాధ్యాయుడు మద్యం తాగి విధులకు హాజరయ్యాడని విచారణలో తేలడంతో సస్పెండ్ చేశామని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు రమాదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుకుడ్‌పెల్లి పాఠశాలలో ఎస్జీటీ ఉపాధ్యా యుడు విలాస్ మద్యం సేవించి విధులకు హాజరయ్యారని గ్రామస్థులు ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఈఆర్పీ విచారణ మేరకు, ఐటీడీఏ పీవో ఆదేశాల అనుసారంగా సస్పెండ్ చేశామని తెలిపారు.

వేతనాలు చెల్లించాలని 104 ఉద్యోగుల ధర్నా

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ ఎదుట 104లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు తమకు వేతనాలు ఇవ్వాలని బుధవారం ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం వేతనాలు వెంటనే చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉద్యోగులు రాజేశం, రమేశ్, సత్యనారాయణ, తిరుపతి, రవి, ప్రశాంత్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానాలు.. ప్రత్యేక పూజలు..



ఆసిఫాబాద్‌లో కుంకుమ పూజలు నిర్వహిస్తున్న మహిళలు

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఆయా గణేశ్ మండలీల వద్ద అన్నదానాలు, ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. సాయినగర్‌లోని ఓంసాయి గణేష్ మండలి, బజారువాడి సమర్థసాయి గణేష్ మండలి వద్ద మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. వేద పండితులు నిమ్మకంటి సంతోష్‌శర్మ, సాయిల ఆధ్వర్యంలో గణపతి పూజ అనంతరం కుంకుమపూజ నిర్వహించారు. మహిళలు ఏకరూప దుస్తులతో అధిక సంఖ్యలో పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావు, వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ అరిగెల నాగేశ్వర్‌రావు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అరిగెల మల్లిఖార్జున్, సీఐ బాలాజీ వరప్రసాద్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు ఖాండ్రే విశాల్‌లు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వ్యాపారస్తులు రఫీక్ జివానీ, తాటిపెల్లి అశోక్, కమిటీ సభ్యులు శంకర్, కిషన్‌గౌడ్, గిరిగౌడ్, ప్రదీప్, మహేష్‌గౌడ్, ప్రహ్లద్, శైలేష్, సంతోష్, రాఘవచారి పాల్గొన్నారు.

కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ ఓం శ్రీ సాయి గణేష్ మండలి వద్ద సబ్ కలెక్టర్ శ్రద్దా శుక్లా బుధవారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయక విగ్రహానికి పూజలు చేశారు. అనంతరం మండలి కమిటీ సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ల వైద్య సురేఖ, బాలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. భక్తులకు సబ్ కలెక్టర్ అన్నదానం చేశారు.

జైనూర్, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పవర్ హౌస్ గణేశ్ యూత్ మండలి ఆధ్వర్యంలో బుధవారం మహిళలు సామూహిక కుంకుమార్చన పూజ నిర్వహించారు. సిర్పూర్(యు) మెయిన్ రోడ్డులో ప్రతిష్ఠంచిన గణనాథుడికి నరెందర్ ఆధ్వర్యంలో భక్తులు పూజలు చేశారు. కార్యక్రమంలో మండలి అధ్యక్షుడు జనార్దన్, గోపాల్, దేవిదాస్, పరెందర్, రామారావ్, దేవరావ్, మహేందర్, ప్రహ్లద్,బాలాజీ, చిమ్నాజీ, రఘునాథ్, సుధాకర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



కాగజ్‌నగర్‌లో భక్తులకు అన్నదానం చేస్తున్న సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా

జిల్లాను అభివృద్ధి చేయాలి

ఆసిఫాబాద్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం చేపట్టిన నీతి ఆయోగ్ కార్యక్రమంలో భాగంగా కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాను ఆకాంక్షిత నుంచి అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకోవాలని నీతి అయోగ్ సీఈవో సుబ్రమణ్యం అన్నారు. న్యూఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బుధవారం దేశంలోని ఆకాంక్షిత జిల్లాల కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాను అభివృద్ధి వైపుగా నడిపించి ముందు వరసలో ఉంచాలని తెలిపారు. జిల్లా బ్లాక్ స్థాయిలో నీతి అయోగ్ ద్వారా చేపడుతున్న పనుల పురోగతిపై సమీక్షించారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నీతి ఆయోగ్ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు.

'కల్యాణలక్ష్మి' చెక్కుల పంపిణీ



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తిర్యాణి మండలానికి చెందిన 16 మంది లబ్ధిదారులకు బుధవారం ఎమ్మెల్యే కోవ లక్ష్మి కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెక్కులను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు అవగాహన కలిగి ఉండాలి

లింగాపూర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు ఎస్ఎంవీఆర్(స్వచ్ఛత, మెరుగుదల, విశ్వసనీయత, బాధ్యత) కార్యక్రమంపై అవగాహన కల్గి ఉండాలని ఎంఈవో శ్రీనివాస్ అన్నారు. మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం మండలంలోని అన్ని గ్రామాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమంలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

చింతలమానేపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ రాజ్‌కుమార్, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని బాఆపూర్ ఆశ్రమ గరిజన బాలికల పాఠశాలలో వైద్యాధికారి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల నివారణకు చర్యలు

బెజ్జూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం కార్యదర్శులతో వివిధ అభివృద్ధి పనులపై సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీవో రాజన్న, ఈసీ రజినీకాంత్ పాల్గొన్నారు.

సైబర్‌నేరాలపై అవగాహన

పెంచికలపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో బుధవారం పోలీసు మిత్ర కార్యక్రమంలో భాగంగా హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఓ కవిత, కానిస్టేబుల్ శ్రీకాంత్, సాయిలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బేకరీ సీజ్

దహెగాం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీ బాలాజీ స్వీట్ అండ్ బేకరీని డీటీ గణేష్, ఫుడ్ శాంపిల్ టేకర్ మల్లికార్జున్‌లు బుధవారం సీజ్ చేశారు. అధికారులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. బేకరీ నుంచి శ్రీ గణేష్ మండలి నిర్వాహకులు భోజనాల సమయంలో మిఠాయిలు పెట్టడానికి బాలుషాను ఆర్డర్ చేసుకుని తీసుకు వెళ్లారు. భోజనాలు చేస్తున్న సమయంలో డబ్బాలో బూజు పట్టిన బాదుషాలు గమనించి బేకరీ వద్దకు చేరుకుని యజమానిని ప్రశ్నించగా దురుసుగా మాట్లాడడంతో వారు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు ఫుడ్ శాంపిల్స్ టేకర్ మల్లికార్జున్, డీటీ గణేష్‌లు బేకరీకి చేరుకుని మిఠాయి షాంపిల్స్‌ను సేకరించి సీజ్ చేశారు. శాంపిల్స్‌ను ఎఫ్ఎ స్ఎల్‌కు పంపించనున్నట్లు తెలిపారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

దహెగాం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే డీలర్లపై చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పలు ఎరువుల దుకాణాలను, గోడౌన్‌లను బుధవారం తనిఖీ చేశారు. స్టాక్ వివరాలు ఎప్పటికప్పుడు రైతులకు కనిపించేలా బోర్డుపై రాయాలన్నారు. ఎరువులను పీఓఎస్ మెషిన్ ద్వారా మాత్రమే పంపిణీ చేయాలని సూచించారు. ఆయన వెంట వ్యవసాయాధికారి రామకృష్ణ ఉన్నారు.

ఏఆర్ ఎస్సైకి అంత్యక్రియలు

కాగజ్‌నగర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ ఈసుగాం నజ్రూల్‌నగర్‌కు చెందిన ఏఆర్ ఎస్సై జగదీష్ చంద్రమండల్(55) గుండెపోటుతో మృతి చెందగా బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఏఆర్ ఎస్సై జగదీష్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ లాంఛనాల ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు సంఘం అధ్యక్షుడు విజయ శంకర్ రెడ్డి, రూరల్ సీఐ కుమార స్వామి, ఎస్సై కళ్యాణ్ పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం వాట్సాప్ చాట్‌బాట్

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సౌకర్యం కోసం టీఎస్ఎన్‌పీడీసీఎల్ ఆధ్వర్యంలో ఆధునిక సాంకేతికతను వినియోగంలోకి తీసుకు వచ్చి వాట్సాప్ చాట్‌బాట్ ద్వారా సేవలు అందిస్తున్నామని ఎస్ఈ శేషారావు రాథోడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపా రు. వినియోగదారులు తమ మొబైల్ వాట్సాప్ ద్వారా 7901628 348 నంబర్‌కు హాయ్ అని మెస్సేజ్ పంపగానే కాల్ సెంటర్‌కు సందేశం అంది వివిధ ఆప్షన్లు వస్తాయని తెలిపారు. కంప్లైంట్, ఫాలో ఆప్, అదనపు సదుపాయాలు కల్పించనున్నామని ఆయన తెలిపారు.

బ్రిడ్జి లేక అవస్థలు



గోండుగూడ సమీపంలో వాగు దాటుతున్న పిల్లలు

కెరమెరి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోండుగూడ సమీపంలో ఒర్రెపై బ్రిడ్జి లేక పోవడంతో వరద ఉప్పొంగి ప్రవహిస్తే ప్రజలు రాకపోలకు ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం ఒర్రె ఉధృతంగా ప్రవహించడంతో బాబేఝరిలో అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లే పిల్లలు, పోషకాహారం తీసుకునేందుకు వెళ్లే గర్భిణులు ఇబ్బందులు పడ్డారు.

రోడ్డుకు మరమ్మతులు

జైనూర్ , సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కరుస్తున్న వర్షాలకు దెబ్బతిన్న మార్లవాయి రోడ్డును మాజీ సర్పంచ్ కనక ప్రతిభ వెంకటేష్ సొంత డబ్బులతో బుధవారం మరమ్మతులు చేయించారు. ప్రజలు రోడ్డుపై రాకపోకలకు ఇబ్బంది పడుతుండడంతో మరమ్మతులు చేపట్టామని తెలిపారు.

గణనాథుల నిమజ్జన స్థలం పరిశీలన

కాగజ్‌నగర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పెద్దవాగులో చేపట్టేన గణేష్ నిమజ్జన స్థలాన్ని బుధవారం ఎస్పీ కాంతి లాల్, సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, ఏఎస్పీ చిత్తరంజన్ పరిశీలించారు. ఈ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి సూచనలు చేశారు. అధికారులు సూచించిన నిబంధనలు మండలీలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గత ఆరేళ్ల నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌ను ప్రభుత్వం విడుదల చేయడం లేదని, రూ.8158 కోట్ల బకాయిలు ఉన్నాయని, గత ప్రభుత్వం బకాయిలు విడుదల చేయలేద ని, 18 నెలలుగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా బకాయిలు విడుదల చేయక పోవడం వల్ల సర్టిఫికేట్లు ఇవ్వడం లేదన్నారు. సర్టిఫికేట్‌లు లేక పోవడంతో పై చదువులకు విద్యార్థులు వెళ్లడం లేదని విద్యకు దూరమవుతున్నా రన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అద్దె భవనాలలో కొనసాగుతున్న ప్రభుత్వ గురుకులాలు, సొంత భవనాలు మంజూరు చేయాలన్నారు. వసతి గృహాల్లో విద్యార్థులకు హెల్త్ క్యాంపులు నిర్వహించాలనితదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. కాగా కలెక్టరేట్ ముట్టడికి ప్రయత్నం చేయగా పోలీసులు విద్యార్థి సంఘాల నాయకులకు మధ్య తోపులాట జరిగింది. అనంతరం కలెక్టరేట్‌లో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సాయికుమార్, సతీష్‌కుమార్, సాయి, కార్తీక్, కరణ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం

వాంకిడి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్య సాధ్యమని యోగా శిక్షకుడు దొడ్డాజీ అన్నారు. స్థానిక బీసీ వసతిగృహంలో బుధవారం యోగా తరగతులను ఆయన ప్రారంభించారు. విద్యార్థులు ప్రతి రోజు యోగా చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు.

ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలి

జైనూర్ , సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వ్యాధులు ప్రబలకుండా ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, వైద్యాధికారి వెంకన్న సూచించారు. మండల కేంద్రంలోని పవర్ హౌజ్ కాలనికి చెందిన ఆమర్ అనే వ్యక్తి కుమారుడు ఆమన్(1)కు మలేరియా నిర్ధారణ కావడంతో ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, వైద్యాధికారి వెంకన్న వారి ఇంటి పరిసరాలను పరిశీలించి పారిశుధ్య పనులు చేయించారు. ప్రజలు ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని వారు కోరుతున్నారు.

ఉప్పొంగిన పెన్‌గంగ

- హుడ్కిలి లోలెవల్ వంతెనపై నిలిచిన రాకపోకలు
- గర్భిణులను ట్రాక్టర్‌పై ముందస్తుగా ఆసుపత్రికి తరలించిన అధికారులు



గర్భిణులను ట్రాక్టర్‌పై దాటిస్తున్న అధికారులు

సిర్పూర్(టి), సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాల మూలంగా సిర్పూర్(టి) మండలం సరిహద్దులో ఉన్న పెన్‌గంగ బుధవారం ఉధృతంగా ప్రవహిస్తోంది. భారీ వర్షాలతో వరదల నేపథ్యంలో అక్కడి ప్రాజెక్టుల గేట్లు ఎత్తడంతో పెన్‌గంగ ఉగ్రరూపం దాల్చింది. దీంతో మండల సరిహద్దులోని అంతరాష్ట్ర పోడ్సా వంతెనను అనుకుని, హుడ్కిలి లోలెవల్ వంతెనపై బ్యాక్ వాటర్ ప్రవహించడంతో రాకపోకలు నిలిచి పోయాయి. ఈ నేపథ్యంలో సిర్పూర్(టి) మండలం హుడ్కిలికి గ్రామానికి చెందిన ముగ్గురు నిండు గర్భిణులు ఆత్రం మమత, టేకం ప్రతిక్ష, కిర్మురె సబ్బంగిలు ఉండడంతో విషయం తెలుసుకున్న తహసిల్దార్ రహీముద్దీన్ ముందు జాగ్రత్తగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారిని హుడ్కిలి గ్రామం నుంచి ట్రాక్టర్‌పై వాగు దాటించి సిర్పూర్(టి) మండలంలోని నవేగాం సబ్ సెంటర్ అంబులె న్స్‌లో తరలించారు. ఈ ముగ్గురికి ఈ నెల 16, 22, 25తేదీల్లో కాన్పు సమయం ఉందని వైద్య సిబ్బంది తెలిపారు.. గర్భిణులకు ప్రస్తుతం సబ్ సెంటర్లలో వైద్య చికిత్సలు అందిస్తున్నారు. ఎస్సై కమలాకర్, ఎంపీడీవో సత్యనారాయణను రెండు చోట్ల బందోబస్తు ఏర్పాటు చేశారు. సాయంత్రం 6 తరువాత ఎవరు కూడా వాగు దాటే ప్రయత్నం చేయవద్దని అధికారులు సూచించారు.

కౌటాల, (ఆంధ్రజ్యోతి): ఎగువన ఉన్న మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలతో పాటు అక్కడి ప్రాజెక్టు గేట్లను ఎత్తడంతో కౌటాల మండల సరిహద్దున గల ప్రాణహిత ఉప్పొంగి ప్రవహిస్తోంది. బుధవారం మండలంలోని తుమ్మిడిహెట్టి వద్ద పుష్కర ఘాట్‌లకు అనుకుని ప్రవహించింది. ప్రాణహిత ఉధృతంగా ప్రవహించడంతో సమీప గ్రామాల ప్రజలు ఉధృతిని చూడడానికి తరలివస్తున్నారు.



ఉన్నతాధికారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ రహీముద్దీన్

విద్యార్థిని ఆత్మహత్య

జైపూర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుందారం గ్రామంలో చదువుకోవడం ఇష్టం లేక ఓ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. జైపూర్ ఎస్ఐ శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కుందారం గ్రామానికి చెందిన దొంతమల్ల శరణ్య(13) అనే బాలిక ఇదే గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏడో తరగతి చదువుకుంటుంది. శరణ్యకు చదువుకోవడం ఇష్టం లేక పాఠశాలకు సక్రమంగా వెళ్లేది కాదు. ఈ విషయంలో తండ్రి గోపాల్ పలుమార్లు మందలించి పాఠశాలకు పంపించేవాడు. చదువుకోవడం ఇష్టం లేని శరణ్య బుధవారం స్నానం చేస్తానని బాత్‌రూంలోకి వెళ్లి చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. బాత్‌రూం నుంచి రాకపోవడంతో అనుమానం వచ్చి బాత్‌రూం తలుపు పగులగొట్టి చూడగా ఉరి వేసుకుని మృతిచెంది ఉంది. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శరణ్య కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శ్రీధర్ తెలిపారు.

రాజీవ్ యువ వికాసం ఏది?

- ఎదురు చూస్తున్న దరఖాస్తుదారులు
- అమలుపై స్పష్టత ఇవ్వని సర్కారు



కెరమెరిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంపీడీవో (ఫైల్)

కెరమెరి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): యువత స్వయం ఉపాధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం అమలు ఎప్పుడు చేస్తామనే దానిపై స్పష్టత లేక పోవడంతో దరఖాస్తుదారులు నిరాశ చెందుతున్నారు. దరఖాస్తులు సమర్పించి ఆరు నెలలు కావస్తున్నా ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోవడం లేదు. దీంతో రాయితీ రుణాలతో స్వయం ఉపాధి పొందుదామనుకున్న యువత ప్రభుత్వ వైఖరిపై మండిపడుతున్నారు. వాస్తవానికి జూన్ 2వ తేదీన రాష్ట్ర అవతరణ దినోత్సవం నాడు రాయితీ రుణాల మంజూరు పత్రాలను పంపిణీ చేయాల్సి ఉంది. కానీ చివరి క్షణంలో ప్రభుత్వం ఆ నిర్ణయాన్ని వెనక్కు తీసుకుంది. దీంతో దరఖాస్తుదారులు ప్రభుత్వ నిర్ణయం కోసం వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

నిబంధనల ప్రకారం..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం యువ వికాసం పథకానికి జిల్లాలోని నిరుద్యోగ యువత దరఖాస్తులు చేసుకున్నారు. ఈ పథకం కిద ఎస్సీ, ఎస్టీ. బీసీ, ఈడబ్ల్యూఎస్, మైనార్టీలకు రూ.50 వేల నుంచి మొద లుకొని రూ.4లక్షల వరకు వివిధ రకాల యూనిట్ల కొనుగోలుకు బ్యాంకు లింకేజీతో కూడిన రుణాలు అందించాలని నిర్ణయించింది. రూ.50 వేల యూనిట్‌కు 100 శాతం సబ్సిడీ,రూ. లక్ష నుంచి రూ.2 లక్షల రుణాలకు 80 శాతం సబ్సిడీ, రూ.2 లక్షల పైనుంచి రూ.4 లక్షల యూనిట్ల కోసం70 సబ్సిడీ ఇవ్వాలని నిర్ణయించా రు. ఇందుకోసం రేషన్‌కార్డు కలిగిన నిరుపేద కుటుంబంలోని ఒక్కరికి మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్ పద్ధతిలో దరఖాస్తులు స్వీకరించారు.

జిల్లా వ్యాప్తంగా అన్ని కేటగిరిల్లో కలిపి మొత్తం 30,022 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. 8,879 యూనిట్ల మంజూరయ్యాయి. వీటిలో మైనార్టీల దరఖాస్తులు 2,677 రాగా 499 మందికి, 33 క్రిస్టియన్ దరఖాస్తు రాగా 25 మందికి, ఈబీసీ/ఈడబ్ల్యూఎస్ దరఖాస్తులు 413 రాగా 410 మందికి, ఎస్టీ దరఖాస్తులు 7,370 రాగా 3,855 మందికి, ఎస్సీ దరఖాస్తులు 6,939 రాగా 2185 మందికి యూనిట్లు మంజూరయ్యాయి. 18 నుంచి 55 ఏళ్ల లోపు నిరుద్యోగులకు రుణాలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో జిల్లాలో భారీగా దరఖాస్తులు వచ్చాయి. కానీ ప్రభుత్వం దీని ఊసే ఎత్తక పోవడంతో దరఖాస్తుదారుల్లో ఆందోళన నెలకొంది. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో అయినా ప్రభుత్వం దీనిపై స్పష్టత ఇచ్చి అమలు చేయాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.

ఏసీబీకి చిక్కిన పంచాయతీ కార్యదర్శి

ఇందిరమ్మ ఇల్లు మొదటి విడత బిల్లు కోసం రూ. 30వేలు డిమాండ్

రూ.20వేలు తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు



ఏసీబీకి పట్టుబడిన పంచాయతీ కార్యదర్శి వెంకటస్వామి

హాజీపూర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇంటి బిల్లు కోసం లంచం అడిగిన పంచాయతీ కార్యదర్శి ఏసీబీకి పట్టుబడిన ఘటన మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలంలోని కర్ణమామిడిలో చోటు చేసుకుంది. ఆదిలాబాద్ జిల్లా ఇన్ చార్జి ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణమామిడి పంచాయతీ కార్యదర్శి వెంకటస్వామి ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు మొదటి దఫా బిల్లు కోసం బేస్‌మెంట్ లేవల్ నిర్మాణం జరిగిన తరువాత ఫొటో క్యాప్చర్ తీసి ఉన్నతాధికారులకు పంపించాల్సిన అవసరం ఉంటుంది. అప్పుడే లబ్ధిదారులకు మొదటి దఫా బిల్లు మంజూరవు తుంది. పంచాయతీ కార్యదర్శి వెంకటస్వామి ఫొటో క్యాప్చర్ తీయడానికి గ్రామంలోని ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారైన డొల్క నాగమణికి 30వేల రూపాయలు డిమాండ్ చేశారు. బ్రతిమిలాడగా 20వేల రూపాయలకు ఒప్పుకున్నాడు. ఈ విషయమై లబ్ధిదారు ఏసీబీ అధికారులను ఆశ్రయించింది. బుధవారం లబ్ధిదారు నివాసానికి వచ్చిన పంచాయతీ కార్యదర్శి 20వేల రూపాయలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. కేసు నమోదు చేసి కరీంనగర్ ఏసీబీ కోర్టుకు తరలించినట్లు తెలిపారు.

● గ్రామస్థుల సంబరాలు..

పంచాయతీ కార్యదర్శి వెంకటస్వామి ఏసీబీ అధికారులకు పట్టుబడినట్లు గ్రామస్థులకు తెలియడంతో పంచాయతీ కార్యదర్శి ద్వారా ఇబ్బందులు పడిన 30 మంది బాధితులు డొల్క నాగమణి ఇంటికి చేరుకున్నారు. తాము కూడా లంచం ఇచ్చామంటూ న్యాయం చేయాలని నినాదాలు చేశారు.. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల బిల్లుల కోసం, ఇంటి నిర్మాణానికి ఎన్‌వోసీల కోసం, ఇతరత్ర అవసరాల కోసం రూ. లక్షల్లో వసూలు చేశాడని ఏసీబీ అధికారుల ముందు వాపోయారు. లంచం ఇచ్చినట్టు ఆధారాలు ఉంటే తమకు తెలియజేస్తే చర్యలు తీసుకుంటామని ఏసీబీ అధికారులు తెలిపారు. కాగా పంచాయతీ కార్యదర్శి ఏసీబీకి పట్టుబడడంతో గ్రామంలో సంబరాలు జరుపుకున్నారు.

మనస్తాపంతో వ్యక్తి బలవన్మరణం

దండేపల్లి సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో అల్లీపూర్ గ్రామంలో రౌతు సురేష్(44) అనే వ్యక్తి మనస్తాపంతో బుధవారం ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై తహసీనోద్దీన్, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సురేష్‌తో 15ఏళ్ల క్రితం సువర్ణతో వివాహం జరిగింది. వారు మహారాష్ట్రలోని పూణేలో నివాసం ఉంటూ జీవనం సాగిస్తున్నాడు, వారికి 14 ఏళ్ల కుమారుడు కునిల్ ఉన్నాడు. అతని భార్య సువర్ణ బంధువుల వద్ద డబ్బులు అప్పు తీసుకొని సురేష్ సొంతానికి వాడుకున్నాడు. ఇటీవల డబ్బుల ఇవ్వమని అతని భార్య సువర్ణ గొడవ చేయడంతో వారి మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. దీంతో సువర్ణ ముంబయికి తన బంధువుల ఇంటికి వెళ్లింది. అప్పటి నుంచి అతను మద్యానికి బానిసయ్యాడు. మూడు రోజుల క్రితం అల్లీపూర్‌కు వచ్చిన సురేష్ తల్లితో కలిసి అద్దె ఇంట్లో ఉంటున్నాడు. బుధవారం ఉదయం ఇల్లు శుభ్రం చేసిన తల్లి కళావతి స్నానం చేసేందుకు వెళ్లింది. ఇదే క్రమంలో సురేష్ సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. తల్లి కేకేలు వేయడంతో ఇరుగుపొరుగు వారు వచ్చి సురేష్‌ను కిందికి దింపేలోపే అప్పటికే అతను మృతి చెందాడు. మృతుడి తల్లి కళావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తహసీనోద్దీన్ వెల్లడించారు.



బొగ్గు అదనపు ఉత్పత్తి సాధిస్తేనే ప్రగతి



అధికారులతో మాట్లాడుతున్న జీఎం రాధాక్రిష్ణ

మందమర్రిటౌన్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బొగ్గు అదనపు ఉత్పత్తి సాధిస్తేనే సింగరేణి ప్రగతి సాధ్యమని జీఎం రాధాక్రిష్ణ అన్నారు. మందమర్రి ఏరియా నూతన జీఎంగా రాధాక్రిష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈసం దర్భంగా జీఎం కార్యాలయ అధికారులు, సిబ్బందిని పరిచయం చేసుకున్నారు. అనంతరం పీఎం శ్యాంసుందర్‌ను ఏరియాకు సంబంధించిన వివరాలను అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్పత్తి ఉత్పాదకత లక్ష్యాల పెంపుదలకు అందరు పని చేయాలన్నారు.నిర్దేశిత లక్ష్యంతో పాటు అదనపు ఉత్పత్తిని సాధిస్తేనే ఏరియా ప్రగతి పథంలో పయనిస్తుందని పేర్కొన్నారు. రక్షణకే యాజమాన్యం పెద్దపీట వేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం విజయ పసాద్, తోటి అధికారులు, ఎస్ఈ ఐఈడీ కిరణ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

మందమర్రిటౌన్, (ఆంధ్రజ్యోతి): వర్షాలకు ఓపెన్‌కాస్టులో ఉత్పత్తికి అంతరాయం కలుగకుండా అధికారులు తగు చర్యలు చేపట్టాలని మందమర్రి ఏరియా జీఎం రాధాక్రిష్ణ అన్నారు. బుధవారం ఏరియాలోని కేకే ఓసీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఓసీపికి నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డంపర్లను డోజర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరం ఓపీకి నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలకు వర్షాలతో అంతరాయం కలిగినప్పటికీ తగ్గుముఖం పట్టిన తరువాత నష్టపోయిన ఉత్పత్తితో పాటు అదనపు ఉత్పత్తిని సాధించాలన్నారు. ఉద్యోగులు అధికారులు సమయ పాలన పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం విజయ ప్రసాద్, ప్రాజెక్టు ఆఫీసర్ మల్లయ్య, మేనేజర్ రామరాజు, ప్రాజెక్టు ఇంజనీరు వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతనంగా జీఎంగా బాధ్యతలు చేపట్టి కేకేఓసీని సందర్శించిన జీఎంను గని అధికారులతో పాటు ఐఎన్‌టీయూసీ నాయకులు సన్మానించి పూలమొక్కలు అందజేశారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు ఆర్లకొండ ఆంజనేయులు, సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

గని ప్రమాద మృతుల వారసులకు క్లర్క్ పోస్టులు

శ్రీరాంపూర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గని ప్రమాదంలో మరణించిన ఉద్యోగుల వారసులకు ఉద్యోగాలు ఇచ్చేటప్పుడు సాధారణ డిగ్రీ అర్హత ఉంటే గ్రేడ్-3 క్లర్క్ పోస్టులు ఇవ్వనున్నట్లు సింగరేణి సీఎండీ ఎన్. బలరాం పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన జారీ చేశారు. గుర్తింపు సంఘంతో ఈ ఏడాది జూన్ 27వ తేదీన 31వ నిర్మాణాత్మక సమావేశం జరిగింది. ఈ సమయంలో యూనియన్ నుంచి ఈ ప్రతిపాదన రావడంతో యాజమాన్యం అధ్యయన కమిటీని వేసింది. ఈ కమిటీ పూర్తిగా పరిశీలన జరిపి తమ నివేదికను సీఎండీకి సమర్పించింది. దీంతో క్లర్క్ గ్రేడ్-3గా నియమించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. త్వరలో ఏఐటీయూసీతో ద్వైపాక్షిక చర్చలు జరిపి, చీఫ్ లేబర్ కమిషనర్ సమక్షంలో త్రైపాక్షిక సమావేశం నిర్వహిస్తామ న్నారు. ఆ తదుపరి తుది ఉత్తర్వులు వెలువరిస్తామన్నారు. గతంలో వారసులు పట్టభద్రులైనా జనరల్ అసిస్టెంట్‌గా మాత్రమే నియామకమయ్యేవారు. 2009లో జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం టెక్నికల్ డిగ్రీలైన మైనింగ్, మెకానికల్, ఎలక్ట్రికల్, సివిల్ ఇంజనీరింగ్, డిప్లొమో (మైనింగ్/మెకానికల్/ఎలక్ట్రికల్), ఐటీఐ(ఫిట్టర్/వెల్డర్) కోర్సులు పూర్తి చేసిన వారికి తగిన ఉద్యోగాలు కల్పించేందుకు యాజమాన్యం అంగీకరించింది. తాజాగా జనరల్ డిగ్రీ అర్హతను కూడా చేర్చి గ్రేడ్-3 క్లర్కు ఉద్యోగాలు కల్పించేందుకు నిర్ణయించారు. ఒకవేళ మరణించిన ఉద్యోగి కుటుంబంలో టెక్నికల్ డిగ్రీ కలిగిన వారు లేకున్నా, సాధారణ డిగ్రీ ఉంటే క్లర్కుగా నియమించడానికి అవకాశం ఉంటుంది. అయితే ఈ నియామకం నేరుగా జరగదు. పోస్టుల లభ్యతను బట్టి కంపెనీ వీరికోసం నిర్వహించే ప్రత్యేక పరీక్షలు అర్హత పొందాల్సి ఉంటుంది. అర్హత సాధించని వారిని జనరల్ అసిస్టెంటుగా నియమిస్తారు.

సదస్సును విజయవంతం చేయండి

శ్రీరాంపూర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్టు కార్మికుల స్థితిగతులపై సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎస్‌సీసీడబ్ల్యూ యూ-ఐఎఫ్‌టీయూ) ఈ నెల 7వ తేదీన హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో సదస్సు నిర్వహించనున్నట్లు యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డి. బ్రహ్మానందం తెలిపారు. శ్రీరాంపూర్‌లోని యూనియన్ కార్యాలయం ఎదుట పోస్టర్లు ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. పోస్టర్లు విడుదల చేసిన వారిలో యూనియన్ బ్రాంచ్ నాయకులు శేఖర్, శంకర్, సత్యం, తిరుపతి, రాజన్న, అప్పారావు, మాడుగుల శంకర్, మల్లేష్, సత్యం, నరసమ్మ, పుష్ప, శారద, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అదనపు కలెక్టర్ దీపక్ తివారి, సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లాతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బుధవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, ఉపాధి హామి పథకం, ఏపీఓలు, సెర్ప్ ఏపీఎంలు, హౌజింగ్ ఇంజనీరింగ్ అధికారులతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, లబ్ధదారులకు బ్యాంకు లింకేజి ద్వారా రుణ సదుపాయం, వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటడం, పారిశుధ్య పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇందరిమ్మ ఇళ్ల పనులను వేగవంతం చేయాలని చెప్పారు. ప్రధానమంత్రి జన్ మన్ పథకం కింద పీవీటీజీలకు 100 శాతం ఇళ్లు మంజూరు చేశామని అన్నారు. అర్హులైన లబ్ధిదారుల జాబితా అందించాలని తెలిపారు. వనమహోత్సవం 2025 కార్యక్రమంలో భాగంగా జిల్లాకు కేటాయించిన లక్ష్యాలను త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, హౌసింగ్ పీడీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చేయూత ఇస్తున్నాం

ఆసిఫాబాద్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా చేయూతనిస్తున్నామని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయం ఆవరణలో ఇందిరా మహిళా శక్తి పథకం కింద ఆసిఫాబాద్ మండలం బూర్గుడ గ్రామానికి చెందిన స్వయం సహాయక సంఘాల సభ్యురాలు కుందారపు రాణికి రూ.10 లక్షతో మంజూరు అయిన మొబైల్ చేపల విక్రయ వాహనం యూనిట్‌ను బుధవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి రిబ్బన్‌కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బూర్గుడ గ్రామానికి చెందిన స్వయం సహాయక సంఘం సభ్యురాలు రూ.4 లక్షల సొంత నిధులు, రూ.6 లక్షల ప్రభుత్వ రాయితీ నిధులతో సంచార చేపల విక్రయ వాహనం నిర్వహించేం దుకు ముందకు రావడం సంతోషంగా ఉందని, మహిళలు వ్యాపారాలు నిర్వహించి ఆర్థిక స్వావలంబన సాధించాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వంట చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని బుధవారం డీఈవో కార్యాలయంలో సూపరింటెం డెంట్ శ్రీనివాస్‌కు ఏఐటీయూసీ నాయకులు వినతి పత్రం అందజే శారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ డబ్బులు విడుదల కాక, సొంతగా డబ్బులతో వంట పాత్రలు, గ్యాస్, వంట సరుకులు కొనుగోలు చేస్తున్నా వంట బిల్లులు వచ్చినప్పుడే తీసుకుంటూ ఆదా యం వచ్చినా రాక పోయినా జీవిస్తున్నారన్నారు. గ్రామల్లో చిన్న చితకా కారణాలతో, డ్వాక్రా గ్రూపుల పేరుతో కార్మికులను తొలగిం చడానికి ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఉపేందర్, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి



జైపూర్ కేజీబీవీలో భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్‌దీపక్

జైపూర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్‌దీపక్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని గంగిపెల్లి గ్రామంలోని పల్లె దవాఖానాను, ఆసుపత్రికి వెళ్లే రహదారులను పరిశీలించారు. పల్లె దవాఖానాకు వచ్చే ప్రజ లకు అందుబాటులో ఉండి వైద్యం అందించాల న్నారు. గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం కుందారం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రిజిష్టర్‌లు, మందుల నిల్వలు, వార్డులను పరిశీలించారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాల యాన్ని సందర్శించి తరగతి గదులు, వంటశాల, మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారా యణ, మెడికల్ ఆఫీసర్ శ్రావ్య, కేజీబీవీ ఎస్‌వో ఫణిబాల తదితరులు పాల్గొన్నారు.

● యూరియా పక్కదారి పట్టకుండా చూడాలి

మంచిర్యాల కలెక్టరేట్: జిల్లాలో కొనసాగుతున్న వ్యవసాయ సాగుకు అనుగుణంగా సకాలంలో యూరి యా, ఎరువులు పంపిణీ చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టర్ చాంబర్‌లో వ్యవసాయాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో యూరియా, ఎరువులు నిల్వల సమృద్ధిగా ఉన్నాయని తెలిపారు. కార్యచరణ ప్రకారం సకాలంలో రైతులకు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. యూరియా పక్కదారి పట్టకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి చాత్రు, సంబంధితశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

● ఇన్‌ఫ్లో ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి

హాజీపూర్: మండలంలోని ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌లోకి వచ్చే వరద ఇన్‌ఫ్లోను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం మండలంలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి చేరుతున్న నీటి పరిస్థితిని పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాజెక్టు నుంచి ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో వివరాలను ఎప్పటికప్పుడు అందించాలని అధికారులు ఆదేశించారు.

వర్షానికి కూలిన ఇళ్లు

నెన్నెల/రెబ్బెన, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల, కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో వర్షాలకు రెండు ఇళ్లు కూలిపోయాయి. నెన్నెల మండలంలో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. జోరువానకు నందులపల్లికి చెందిన కుమ్మరి మొండి ఇల్లు కూలిపోయింది. భార్యతో పాటు మొండి త్రుటిలో ప్రాణాలతో బయటపడ్డాడు. నిరుపేదలను ఆదుకోవాలని కోరారు. మాజీ ఎంపీటీసీ బొమ్మెన హరీష్‌గౌడ్, నాయకులు గజేందర్‌సింగ్ బాధితులను పరామర్శించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సాయం అందేలా చూస్తామని భరోసా ఇచ్చారు. రెబ్బెన మండలం కైరిగాం చెందిన అనసూర్య అనే వృద్ధురాలి ఇల్లు కూలి పోయింది. ఇల్లు కూలిన సమ యంలో అనసూర్య ఇంట్లో లేదు. దీంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. పరిహారం ఇప్పించాలని అనసూర్య ఈ మేరకు అధికారులకు వినతిపత్రం అందజేసింది.

యూరియా కోసం రైతుల ఆందోళన



చెన్నూర్‌లోని గోదాం వద్ద క్యూలో ఉన్న రైతులు

చెన్నూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా చెన్నూరులో యూరియా కోసం రైతులు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గోదాం వద్దకు చేరుకుని నిరీక్షించారు. యూరియా బస్తాలు వచ్చాయన్న సమాచారం మేరకు క్యూలైన్‌లలో నిల్చున్నారు. అధికారులు టోకెన్ ఇవ్వడం జరగదని చెప్పడంతో అక్కడ నుంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం (ఐబీ చౌరస్తా) వద్దకు చేరుకుని రహదారిపై బైఠాయించి ధర్నా చేశారు. విషయం తెలుసుకున్న మాజీ కౌన్సిలర్ అనిల్ అక్కడకు చేరుకుని రైతులకు సంఘీభావం తెలిపారు. ధర్నా కొనసాగుతుండడంతో సీఐ దేవేందర్‌రావు, ఎస్ఐ సుబ్బారావు అక్కడకు చేరుకుని ధర్నా విరమించాలని చెప్పడంతో రైతులు నిరాకరించారు. మంత్రి వివేక్ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. పోలీసులు ఎంత నచ్చజెప్పినా వినకపోవడంతో సీఐ దేవేందర్‌రావు మాజీ కౌన్సిలర్ అనిల్‌ను చేయిపట్టి స్టేషన్‌కు లాక్కెళ్లారు. దీంతో రైతులు వెళ్లిపోయారు. కాగా మాజీ కౌన్సిలర్ అనిల్‌పై సీఐ చేయిచేసుకున్నాడనే సమాచారం మేరకు బీఆర్ఎస్ నాయకులు అక్కడకు చేరుకుని పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. కౌన్సిలర్‌పై చేయిచేసుకున్న దేవేందర్‌రావు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ స్టేషన్ ఎదుట ఆందోళన నిర్వహించారు. కోటపల్లి రూరల్ సీఐ బన్సీలాల్, ఎస్ఐ సుబ్బారావులు అక్కడకు చేరుకుని బీఆర్ఎస్ నాయకులకు నచ్చజెప్పడంతో అక్కడ నుంచి వెళ్లిపోయారు. ఈ ఆందోళనలో నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ రాజారమేష్, మాజీ జడ్పీటీసీ మోతె తిరుపతి, మాజీ ఎంపీపీ మంత్రి బాపు, మాజీ వైస్ ఎంపీపీ బాపురెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జీపీవోల నియామక ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలి

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామ పాలనాధికారుల(జీపీవో) నియామక ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ లోకేష్ కుమార్ అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా మంచిర్యాల కలెక్టర్, అదనపు కలెక్టర్, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పాలన అధికారుల నియామక ప్రక్రి య పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఈ నెల 5న హైద్రాబాద్‌లోని హైటెక్ సిటీలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా గ్రామ పాలన అధికారులకు నియామక పత్రాలు పంపిణీ చేస్తారని తెలిపారు. కార్యక్రమానికి సకాలంలో హాజరయ్యేలా చర్యలు తీసుకోఆలని సూచించారు. కార్యక్రమంలో కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ చంద్రయ్య, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన గ్రామ పాలనాధికారుల నియామకంలో భాగంగా ఉత్తర్వుల పంపిణీ కార్యక్రమానికి గ్రామ పాలన అధికారులను సకాలంలో తీసుకురావాలని ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ లోకేష్‌కుమార్ అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్‌లు, అదనపు కలెక్టర్‌లు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిం చారు. కార్యక్రమలో కుమరం భీం జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావులతో పాటు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మన్‌దీప్ గోల్‌తో గట్టెక్కింది!

కొరియాతో భారత్ మ్యాచ్ డ్రా


ఆసియా కప్ హాకీ

రాజ్‌గిర్ (బిహార్): ఆట ముగిసేందుకు మరో ఎనిమిది నిమిషాలే ఉంది. స్కోరు చూస్తే భారత్ 1-2తో కొరియాతో సూపర్ ఫోర్ తొలి మ్యాచ్‌లో వెనుకంజలో ఉంది. దాంతో ఆసియా కప్ హాకీ టోర్నీలో ఆతిథ్య భారత్‌కు తొలి పరాజయం తప్పదేమో అనిపించింది. కానీ ఈ దశలో ఫార్వర్డ్ మన్‌దీప్ సింగ్ మాయ చేశాడు. లెఫ్ట్ ఫ్లాంక్ నుంచి హర్మన్‌ప్రీత్ అందించిన రివర్స్ పాస్‌ను సుఖ్‌జీత్ సింగ్..మన్‌దీప్ వైపు కొట్టాడు. బంతిని అందుకున్న మన్‌దీప్ నలుగురు కొరియా డిఫెండర్లను బోల్తాకొట్టిస్తూ గోల్‌పోస్ట్‌లోకి పంపాడు. అంతే.. స్కోరు 2-2తో సమం. భారత ఫ్యాన్స్‌లో ఆనందం. సూపర్-4లో భాగంగా కొరియాతో బుధవారం జరిగిన మ్యాచ్‌ను భారత్ డ్రా చేసింది. దాంతో టోర్నమెంట్‌లో అపజయమెరుగని రికార్డును ఆతిథ్య జట్టు కొనసాగించింది. ఎనిమిదో నిమిషంలోనే హార్దిక్ సింగ్ గోల్ చేసి భారత్‌ను ఆధిక్యంలో నిలిపాడు. యాంగ్ జిహాన్ (12) గోల్‌తో స్కోరు సమం చేసిన కొరియా..కొద్ది సేపటికే కిమ్ (14) సాధించిన గోల్‌తో ఆధిక్యంలోకి వెళ్లింది. డ్రా దరిమిలా రెండు జట్లు చెరో పాయింట్ దక్కించుకున్నాయి. మరో సూపర్ ఫోర్ పోరులో మలేసియా 2-0తో చైనాను చిత్తు చేసింది. ఇక గురువారం జరిగే సూపర్-4 రెండో మ్యాచ్‌లో మలేసియాను భారత్ ఢీకొంటుంది.


మన్‌దీప్ సింగ్

జొకో.. జోరు

యూఎస్ ఓపెన్




సబలెంకా

సెమీస్‌కు నొవాక్, సబలెంక

న్యూయార్క్: 25వ గ్రాండ్‌స్లామ్ వేటలో ఉన్న సెర్బియా యోధుడు నొవాక్ జొకోవిచ్, మహిళల డిఫెండింగ్ చాంప్ అరియానా సబలెంక యూఎస్ ఓపెన్ సెమీస్‌కు దూసుకెళ్లారు. గతేడాది రన్నరప్, లోకల్ స్టార్ టేలర్ ఫ్రిట్జ్‌తో ముఖాముఖి పోరులో ఏడో సీడ్ జొకో తన రికార్డును 11-0తో మరింతగా మెరుగుపర్చుకొన్నాడు. బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో జొకో 6-3, 7-5, 3-6, 6-4తో నాలుగో సీడ్ ఫ్రిట్జ్‌పై సునాయాసంగా గెలిచాడు. ఈ క్రమంలో 53వసారి గ్రాండ్‌స్లామ్ సెమీస్ చేరిన నొవాక్.. అమెరికా లెజెండ్ క్రిస్ ఎవర్ట్ 52సార్లు సెమీస్ చేరిన రికార్డును బద్దలుకొట్టాడు. సెమీస్‌లో అల్కారజ్‌తో జొకో అమీతుమీ తేల్చుకోనున్నాడు. తొలి సెట్‌లో నొవాక్ అలవోకగా నెగ్గినా.. రెండో సెట్‌లో ఫ్రిట్జ్ నుంచి పోటీ ఎదురైంది. అయితే, 5-5 వద్ద తనదైన దూకుడు ప్రదర్శించిన నొవాక్ సెట్‌ను సొంతం చేసుకొని 2-0 ఆధిక్యంలోకి వెళ్లాడు. కానీ, మూడో సెట్‌లో ఫ్రిట్జ్ పోరాడి గెలిచినా.. ఆ తర్వాతి సెట్‌లో జొకో జోరు ముందు నిలవలేక పోయాడు. 2003లో చివరిసారి అమెరికా ఆటగాడు ఆండీ రాడిక్ న్యూయార్క్‌లో టైటిల్ నెగ్గాడు. ఈసారి ఫ్రిట్జ్ ఆ లోటు తీరుస్తాడనుకొంటే.. జొకో అడ్డుపడ్డాడు. కాగా, టాప్‌సీడ్ సబలెంకకు క్వార్టర్స్‌లో వాకోవర్ లభించింది. ప్రత్యర్థి మార్కెటా వొండ్రుసొవా (చెక్) ప్రాక్టీస్ చేస్తుండగా మోకాలికి గాయమైంది. దీంతో ఆమె బరిలోకి దిగలేక పోయింది. శుక్రవారం జరిగే సెమీస్‌లో గతేడాది ఫైనలిస్ట్ పెగులతో స బలెంక తలపడనుంది.

భాంబ్రి తొలిసారి..: యుకీ భాంబ్రి కెరీర్‌లో తొలిసారి గ్రాండ్‌స్లామ్ క్వార్టర్స్‌కు చేరుకొన్నాడు. డబుల్స్ ప్రీక్వార్టర్స్‌లో భాంబ్రి-మైకేల్ వీనజ్ (న్యూజిలాండ్) జంట 6-4, 6-4తో జర్మనీకి చెందిన కెవిన్ క్రవీట్జ్-టిమ్ ప్యూట్జ్‌పై గెలిచింది.

నొవాక్ 'సోడా పాప్' సంబరాలు


మ్యాచ్ గెలిచిన తర్వాత జొకోవిచ్ 'కె-పాప్ డీమన్ హంటర్స్' సినిమాలోని 'సోడా పాప్' పాట డ్యాన్స్‌తో సంబరాలు చేసుకొన్నాడు. జొకో కుమార్తె తారకు 'కె-పాప్ డీమన్ హంటర్స్' అంటే ఎంతో ఇష్టం. కాగా, తార పుట్టిన రోజు కావడంతో.. ఆ డ్యాన్స్ మూమెంట్స్ ద్వారా కుమార్తెకు జొకో శుభాకాంక్షలు తెలిపాడు.

సినర్‌పై రూ. 2.64 కోట్ల పందెం

ఈ ఏడాది యూఎస్ ఓపెన్ టైటిల్‌ను డిఫెండింగ్ చాంప్ యానిక్ సినర్ నిలబెట్టుకొంటాడని కెనడా ర్యాపర్, సింగర్ డ్రేక్ భారీగా బెట్టింగ్ పెట్టాడు. ఇటలీ టాప్ సీడ్ ప్లేయర్‌పై డ్రేక్ రూ. 2.64 కోట్లు పందెం కాశాడు. ఒకవేళ సినర్ విజయం సాధిస్తే.. డ్రేక్‌కు రూ. 4.46 కోట్లు దక్కనున్నాయి.

నిఖత్‌పై అందరి దృష్టి!

నేటినుంచి ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్



లివర్‌పూల్ (ఇంగ్లండ్): ప్రతిష్ఠాత్మక వరల్డ్ బాక్సింగ్ చాంపియన్‌షిప్స్ గురువారం ఇక్కడ ఆరంభం కానున్నాయి. ప్రపంచ బాక్సింగ్ కొత్త పాలక మండలి..'వరల్డ్ బాక్సింగ్' ఆధ్వర్యంలో తొలిసారి ఈ పోటీలు జరగనున్నాయి. ఈ చాంపియన్‌షిప్స్‌ను పురుషులు, మహిళల విభాగాలలో కలిపి ఒకేసారి నిర్వహిస్తుండడం విశేషం. ఇక..భారత్‌కు సంబంధించిన తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్, టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత లవ్లీనా బోర్గొహైన్‌పై అందరి దృష్టి నిలిచింది. రెండుసార్లు ప్రపంచ చాంపియన్ నిఖత్ వరుసగా మూడో వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో మూడు వేర్వేరు బరువు విభాగాలలో తలపడుతుండడం గమనార్హం. 2022లో 52కి. విభాగంలో విశ్వవిజేతగా నిలిచిన నిఖత్.. 2023లో 50కి. కేటగిరీలో టైటిల్ దక్కించుకుంది. ఇక ఈసారి 51 కి. విభాగంలో తలపడుతోంది. మారిన బరువు విభాగంలో నిఖత్ ఎలా రాణిస్తుందన్నది ఆసక్తికరం. పారిస్ ఒలింపిక్స్‌లో రెండో రౌండ్‌లోనే ఓటమి చవిచూసిన జరీన్.. ఏడాది తర్వాత అంతర్జాతీయ పోటీల బరిలో దిగుతోంది. పారిస్ క్రీడల తర్వాత నిఖత్‌తోపాటు లవ్లీనా ఒక దేశవాళీ ఈవెంట్‌లో మాత్రమే పాల్గొన్నారు. ఇద్దరికీ తొలి రౌండ్లలో కఠిన ప్రత్యర్థులు ఎదురు కానున్నారు. 65 దేశాల నుంచి 550మంది బాక్సర్లు ఈ ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో తలపడుతున్నారు. భారత్ నుంచి పురుషుల, మహిళల విభాగాల్లో చెరి పదేసి మంది బాక్సర్లు పోటీపడుతున్నారు.

రోహిత్, గిల్ అండ్ కోకు 'బ్రాంకో టెస్ట్' లేనట్టే..



న్యూఢిల్లీ: భారత జట్టు ఆటగాళ్లకు బీసీసీఐ సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్సీ (సీవోఈ)లో ఫిట్‌నెస్ టెస్ట్‌లు నిర్వహిస్తూంటుంది.. ఇది రొటీన్‌గానే జరిగేదే అయినా.. సరికొత్తగా 'బ్రాంకో' టెస్ట్‌ను ప్రవేశపెడుతున్నారని కొద్ది రోజుల క్రితం వచ్చిన వార్త కారణంగా అందరి దృష్టినీ ఆకర్షించింది. రగ్బీ ఆటగాళ్లకు నిర్వహించే ఈ కఠిన పరీక్షను రోహిత్ శర్మను బయటకు పంపేందుకే ప్రవేశపెడుతున్నారంటూ విమర్శలు కూడా వినవచ్చాయి. తాజా సీజన్ నేపథ్యంలో రోహిత్, శుభ్‌మన్ గిల్, బుమ్రా సహా మరికొందరు కాంట్రాక్ట్ ప్లేయర్లు సీవోఈలో ఫిట్‌నెస్ పరీక్షకు హాజరయ్యారు. అయితే, వీరెవరికీ బ్రాంకో టెస్ట్ నిర్వహించలేదని తెలుస్తోంది. ఈ నూతన టెస్ట్‌ను ఇంకా ఫిట్‌నెస్ పరీక్షల్లో భాగం చేయలేదట. అందుకే పాతపద్ధతిలో యో-యో టెస్ట్ ద్వారానే ఫిట్‌నెస్‌ను పరీక్షించిందట. పైగా బోర్డు కూడా బ్రాంకో టెస్ట్‌ను ప్రవేశపెడుతున్నట్టు అధికారికంగా కూడా ప్రకటించలేదు.

బెంగాల్‌పై పుణెరి గెలుపు



విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): ప్రొ కబడ్డీ లీగ్-12 తొలి అంచెలో భాగంగా బుధవారం జరిగిన తొలి మ్యాచ్‌లో పుణెరి పల్టన్ 45-36 స్కోరుతో బెంగాల్ వారియర్స్‌ను ఓడించింది. ఆట ప్రారంభం నుంచి పల్టన్ ఆటగాళ్లు దూకుడుగా ఆడి వారియర్స్‌పై ఒత్తిడి పెంచారు. ప్రథమార్థం 26-22 స్కోరుతో ముగిసింది. ద్వితీయార్థంలో పుంజుకునేందుకు యత్నించిన బెంగాల్ వారియర్స్‌ను పుణెరి డిఫెండర్లు నిలువరించారు. వారియర్స్ కెప్టెన్, స్టార్ రైడర్ దేవంక్ పలుమార్లు ప్రత్యర్థి డిఫెండర్లకు చిక్కడంతో మ్యాచ్‌పై పట్టు కోల్పోయారు. పుణెరి జట్టులో అస్లాం ఇనాందార్, ఆదిత్య షిండే చెరో 11 పాయింట్లు సాధించారు. హరియాణా స్టీలర్స్-యు ముంబా జట్ల మ్యాచ్ 36-36తో టైగా ముగిసింది. అయితే షూటౌట్‌లో హరియాణా విజయం సాధించింది.

శ్రీలంకదే తొలి టీ20

హరారే: జింబాబ్వేతో తొలి టీ20లో శ్రీలంక గెలుపొందింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో తొలుత జింబాబ్వే 20 ఓవర్లలో 175/7 చేసింది. దుష్మంత చమీర 3 వికెట్లు తీశాడు. ఛేదనలో శ్రీలంక 19.1 ఓవర్లలో 177/6 స్కోరు చేసి గెలుపొందింది. నిస్సాంక (55), కమిందు మెండిస్ (41 నాటౌట్) రాణించారు.

కబడ్డీ విజేత జోగులాంబ లయన్స్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): యువ తెలంగాణ కబడ్డీ లీగ్ ట్రోఫీని జోగులాంబ లయన్స్ జట్టు కైవసం చేసుకుంది. బుధవారం ఎల్బీ స్టేడియంలో జరిగిన ఫైనల్లో లయన్స్ 35-21 స్కోరుతో భద్రాద్రి బ్రేవ్స్ జట్టుపై నెగ్గింది. లీగ్ ఉత్తమ రైడర్‌గా జి.రాజు, డిఫెండర్‌గా నవీన్, ఆల్‌రౌండర్‌గా లక్ష్మణ్‌కు ప్రత్యేక అవార్డులు లభించాయి. ఐపీఎస్ అధికారి రాహుల్ హెగ్డే, తెలంగాణ కబడ్డీ సంఘం అధ్యక్షుడు కాసాని వీరేష్, కార్యదర్శి మహేందర్ విజేతలకు ట్రోఫీ ప్రదానం చేశారు.

తిప్పేసిన నితిన్



చెన్నై: బుచ్చిబాబు ఆలిండియా క్రికెట్ టోర్నమెంట్ రెండో సెమీ ఫైనల్లో హరియాణాను 99 పరుగులతో ఓడించి హైదరాబాద్ జట్టు ఫైనల్‌లో ప్రవేశించింది. బుధవారం తమ రెండో ఇన్నింగ్స్‌లో హరియాణా 272 పరుగుల లక్ష్యంతో ఛేదన ప్రారంభించగా, హైదరాబాద్ లెఫ్టార్మ్ స్పిన్నర్ నితిన్ సాయి యాదవ్ (7/44) దెబ్బకు 62.4 ఓవర్లలో 181కు ఆలౌటై పరాజయం పాలైంది. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ 225, హరియాణా 208కు, రెండో ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ 254కు ఆలౌటయ్యాయి. హైదరాబాద్ రెండో ఇన్నింగ్స్‌లో 91 పరుగులతో రాణించిన వరుణ్ గౌడ్‌కు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది.

ఇకపై మరింత బాధ్యతగా ఉంటాం

'చిన్నస్వామి' ఘటనపై కోహ్లి



న్యూఢిల్లీ: బెంగళూరు చిన్నస్వామి స్టేడియంలో గత జూన్ నాలుగున జరిగిన తొక్కిసలాటపై రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లి ఎట్టకేలకు స్పందించాడు. 'అది.. మా ఫ్రాంచైజీ చరిత్రలో ఓ సంతోషకరమైన ఘట్టం కావాల్సింది. కానీ విషాదంగా మారింది. ఆ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన, గాయపడిన మా అభిమానుల గురించి ఆలోచిస్తున్నా. వారి గురించి ప్రార్థిస్తున్నా. ఇకపై జాగ్రత్తగా, బాధ్యతగా, గౌరవంగా ముందుకు సాగుతాం' అని కోహ్లి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ సీజన్ ఐపీఎల్ టైటిల్‌ను ఆర్‌సీబీ గెలుచుకున్న సందర్భంగా చిన్నస్వామి స్టేడియంలో ఏర్పాటు చేసిన విజయోత్సవంలో తొక్కిసలాట జరిగి 11 మంది క్రికెట్ ఫ్యాన్స్ మరణించగా, మరో 71 మంది గాయపడ్డారు.

బిజినెస్

వృద్ధి, ఉద్యోగాల కల్పనకు ఊతం

జీఎస్‌టీ సంస్కరణలపై హర్షాతిరేకాలు



ప్రభుత్వం బుధవారం ప్రకటించిన జీఎస్‌టీ సంస్కరణలు ఆర్థిక వృద్ధికి, ఉపాధికల్పనకు ఊతం ఇచ్చేలా ఉన్నాయి. ఒక పక్క భౌగోళిక, రాజకీయ పరిస్థితుల ప్రభావంతో దేశీయ ఆర్థిక వ్యవస్థ తీవ్ర సవాలును ఎదుర్కొంటోంది. మరోపక్క అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల పోటు ఎగుమతుల రంగానికి తీరని కాటుగా పరిణమించింది. గత కొద్ది కాలంగా ఎగుమతుల రంగం భారీ తిరోగమనంలో ఉంది. సుంకాల ప్రభావం వల్ల రాబోయే కాలంలో ఎగుమతులు భారీగా పడిపోవచ్చునన్న భయాలు కూడా సర్వత్రా నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న ఈ చర్య దేశీయ వినియోగాన్ని గణనీయంగా పెంచుతుందని, తద్వారా ఎగుమతుల నష్టాన్ని భర్తీ చేస్తుందని విశ్లేషకులంటున్నారు. దీనికి తోడు దేశంలో పండుగల సీజన్ ప్రారంభమవుతోంది. ఈ సీజన్‌లో వస్తు సేవల వినియోగం పెరిగి ఆర్థిక వ్యవస్థ ఉత్తేజితం కావడానికి ఈ చర్య దోహదపడుతుందన్నది వారి అభిప్రాయం. దేశంలో జీఎస్‌టీ ప్రవేశపెట్టిన తర్వాత తొలి భారీ ప్రక్షాళన ఇదే. ఈ చర్యల ఫలితంగా ప్రభుత్వం పన్నుల రూపేణ ఆదాయాన్ని నష్ట పోయినా, దేశీయ వినియోగం భారీగా పెరిగి ఆర్థిక వ్యవస్థ సుంకాల పోటు నుంచి చాలా వరకు బయట పడుతుందని ఆర్థిక నిపుణుల అంచనా. దీంతో ఇప్పటి వరకు నీరసించిన ప్రైవేటు పెట్టుబడులు సైతం ఊపందుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు. అదే జరిగితే జీడీపీ వృద్ధి రేటుకూ ఢోకా ఉండదని అంచనా. ఇప్పటివరకు ఉన్న శ్లాబ్‌లను రెండు శ్లాబ్‌లకు కుదించడం ద్వారా సగటు మనిషి వినియోగించే అనేక వస్తువులు 5 శ్లాబ్‌లోకి జారుకుని సగటు జీవికి ఉపశమనం కలుగుతుంది. దీన్ని దేవీ నవరాత్రులు, దీపావళి ముందు ప్రభుత్వం ప్రకటించిన బొనాంజాగా నిపుణులు, పరిశీలకులు అభివర్ణిస్తున్నారు. ఈ సంస్కరణలు సగటు జీవిపైనే కాకుండా రైతాంగం, చిన్న వ్యాపారులపై కూడా భారాన్ని గణనీయంగా తగ్గిస్తాయన్నది వారి అభిప్రాయం. ఇది సగటు జీవికి అసలైన పండుగ అని ప్రభుత్వాధికారి ఒకరు వ్యాఖ్యానించారు.

స్టాక్ మార్కెట్ పరుగే

జీఎస్‌టీ నిర్ణయం గురువారం స్టాక్‌మార్కెట్‌కు పెద్ద ఉత్తేజం కావచ్చునని మార్కెట్ నిపుణులంటున్నారు. ఇటీవల కాలంలో ఈక్విటీ, ఫారెక్స్ మార్కెట్లు భారీ ఆటుపోట్లు ఎదుర్కొంటున్నాయి. ప్రభుత్వ నిర్ణయంతో మార్కెట్ తాత్కాలికంగా ఊపిరి తీసుకోవడం ఖాయమని, గురువారం మార్కెట్ సానుకూలంగా స్పందించవచ్చునని పరిశీలకులన్నారు.

పురోగామి చర్య : ఎంట్రీ లెవల్ టూ వీలర్లు, కార్లపై విధించే జీఎస్‌టీని 28 శాతం నుంచి 18 శాతానికి కుదించడంపై ఆటోమొబైల్ పరిశ్రమ హర్షం వ్యక్తం చేసింది. 'జీఎస్‌టీ రేట్లను హేతుబద్ధం చేయాలని మేము ఎప్పటి నుంచో కోరుతున్నాం. ప్రభుత్వం ఎట్టకేలకు మా మొర ఆలకించింది' అని మెర్సిడెజ్ బెంజ్ ఇండియా ఎండీ, సీఈఓ సంతోష్ అయ్యర్ ఒక ప్రకటనలో తెలిపారు. దీన్ని ఆయన సరైన సమయంలో తీసుకున్న పురోగామి చర్యగా అభివర్ణించారు.ఈ చర్య తప్పకుండా దేశంలో కార్ల డిమాండ్‌ను పెంచుతుందన్నారు. అన్ని రకాల ఆటోమొబైల్ విడి భాగాలను 28 శాతం జీఎస్‌టీ నుంచి 18 శాతం జీఎస్‌టీ శ్లాబులోకి మార్చడంపై ఆ కంపెనీలకు ప్రాతినిధ్యం వహించే ఆటోమోటివ్ కంపోనెంట్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ (ఏసీఎంఏ) ప్రశంసించింది. ఎప్పటి నుంచో అడుగుతున్న తమ ఈ కోరికను ప్రభుత్వం ఇన్నాళ్లకు మన్నించిందని ఆ సంస్థ డైరెక్టర్ జనరల్ విన్నీ మెహతా తెలిపారు.

చిన్న కార్ల ధరలు ఎంత తగ్గొచ్చు..?

4మీటర్లలోపు వాహనాల విభాగంలో 1200 సీసీ వరకు పెట్రోల్ కార్లపై ప్రస్తుతం 28 శాతం జీఎస్‌టీతోపాటు ఒక శాతం సెస్సు కూడా చెల్లించాల్సి ఉంటుంది. 1500 సీసీ వరకు డీజిల్ కార్లపై కేంద్రం 28 శాతం జీఎస్‌టీతోపాటు 3 శాతం సెస్సు వసూలు చేస్తోంది. ఈ విభాగ కార్లను తాజాగా 18 శాతం శ్లాబులో చేర్చారు. దీంతో చిన్న, హ్యాచ్‌బ్యాక్ మోడళ్ల ధరలు 8-10 శాతం వరకు తగ్గవచ్చని అంచనా వేసింది. మారుతి సుజుకీ చిన్న కారు ఆల్టో కే10 ఎక్స్‌షోరూమ్ ధర రూ.4..23 లక్షల నుంచి రూ.3.89 లక్షలకు తగ్గే అవకాశం ఉంది. హ్యూండయ్ హ్యాచ్‌బ్యాక్ మోడల్ గ్రాండ్ ఐ10 మోడల్ రేటు రూ.5.98 లక్షల నుంచి రూ.5.51 లక్షలకు దిగిరావచ్చు. రెనో క్విడ్ ఎక్స్ షోరూమ్ ధర కూడా రూ.40,000 వరకు తగ్గవచ్చని అంచనా.

ఎగుమతిదారుల హర్షం: ఇక నుంచి వారం రోజుల్లోనే జీఎస్‌టీ రిఫండ్స్ ప్రక్రియ పూర్తి కానుంది. ఇది ఎగుమతిదారుల నిధుల కొరత సమస్యనూ తీరుస్తుందని భారత ఎగుమతి సంఘాల సమాఖ్య (ఫియో) డైరెక్టర్ జనరల్ అజయ్ సహాయ్ ఒక ప్రకటనలో తెలిపారు. రూ.1,000 వరకు ఉన్న జీఎస్‌టీ రిఫండ్‌లను అనుమతించడం ఇ-కామర్స్ ఎగుమతిదారులకు పెద్ద ఊరట అన్నారు.

ద్రవ్యోల్బణం కట్టడికి దోహదం: జీఎస్‌టీ రేట్ల తగ్గింపు వస్తు, సేవల వినియోగం భారీగా పెరగడంతోపాటు ద్రవ్యోల్బణం కట్టడి, ఆర్థిక వృద్ధి, ఉద్యోగాల కల్పనకూ ఊతమివ్వనుందని ఇండస్ట్రీ వర్గాలంటున్నాయి. మరింత సరళమైన, పారదర్శకమైన, సమగ్ర పన్ను వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు తాజా సంస్కరణలు దోహదపడనున్నాయని మహీంద్రా గ్రూప్ సీఈఓ, ఎండీ డాక్టర్ అనిశ్ షా అన్నారు.

రియల్టీ, మౌలిక రంగాలకు బూస్ట్ : సిమెంట్, స్టీల్‌పై జీఎస్‌టీని 28 శాతం నుంచి 18 శాతం తగ్గించడం రియల్ ఎస్టేట్, మౌలిక రంగాల నిర్మాణ వ్యయాలను గణనీయంగా తగ్గించనుందని నరెడ్కో జాతీయ అధ్యక్షుడు, హీరానందిని గ్రూప్ చైర్మన్ నిరంజన్ హీరానందిని అన్నారు. ముఖ్యంగా అందుబాటు గృహ ప్రాజెక్టులకు లబ్ధి చేకూరనుందని, నిర్మాణ వ్యయం తగ్గితే కొనుగోలుదారులకు ఈ గృహాలు మరింత తక్కువ ధరకు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుందన్నారు.

వికసిత్ భారత్ లక్ష్యానికి తోడ్పాటు: 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశాల సరసన చేర్చాలన్నది కేంద్ర ప్రభుత్వ లక్ష్యం. ఇందుకోసం జీడీపీ ఏటా 7 శాతానికి పైగా వృద్ధిని నమోదు చేయాల్సిన అవసరం ఉంది. ట్రంప్ 50 శాతం సుంకాలతో ఎగుమతి ఆధారిత రంగాల వ్యాపారంపై ప్రభావం చూపనున్న తరుణంలో జీఎస్‌టీ రేట్ల తగ్గింపు దేశీయంగా వినియోగాన్ని పెంచి వృద్ధి రేటుకు అండగా నిలవనుందని హీరానందాని అన్నారు.

బంగారం @ రూ.1.07 లక్షలు

వరుసగా 8 రోజుల్లో రూ.6,900 అప్



పసిడి సరికొత్త జీవనకాల పతాక స్థాయికి ఎగబాకింది. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (99.9 శాతం స్వచ్ఛత) బంగారం ధర మరో రూ.1,000 పెరిగి రూ.1,07,070కి చేరింది. 99.5% స్వచ్ఛత గల బంగారం రేటు కూడా అదే స్థాయిలో ఎగబాకి రూ.1,06,200కి చేరుకుంది. కిలో వెండి మాత్రం ఎలాంటి మార్పు లేకుండా రూ.1,26,100 పలికింది. బంగారం ధరలు పెరగడం వరుసగా ఇది ఎనిమిదో రోజు. గడిచిన 8 రోజుల్లో తులం బంగారం రూ.6,900 పెరిగింది. అమెరికన్ ఫెడరల్ రిజర్వ్ ఈ నెలలో ప్రామాణిక వడ్డీరేట్లను మరో 0.25% తగ్గించవచ్చన్న అంచనాలతోపాటు అంతర్జాతీయ భౌగోళిక ఉద్రిక్తతలు, వాణిజ్య అనిశ్చితులు బంగారం, వెండి ధరలకు ఆజ్యం పోస్తున్నాయి. ఇంటర్నేషనల్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం ధర రేటు తొలిసారిగా 3,600 డాలర్ల మైలురాయిని దాటింది. ఒకదశలో 3,622 డాలర్ల వద్ద ఆల్‌టైం ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. సిల్వర్ 41.35 డాలర్ల స్థాయిలో ట్రేడైంది. అంతర్జాతీయంగా వీటి ధరలు మున్ముందు మరింత ఎగబాకవచ్చని బులియన్ నిపుణులు భావిస్తున్నారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



4 తేదీ			
హైదరాబాద్	535	విజయవాడ	570
వరంగల్	537	గోదావరి	570
చిత్తూరు	578	విశాఖపట్నం	575
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	98	విజయవాడ	127
వరంగల్	98	గుంటూరు	115
కరీంనగర్	98	ఒంగోలు	115
మహబూబ్‌నగర్	98	చిత్తూరు	90
కర్నూలు	98	నెల్లూరు	95
విశాఖపట్నం	131	అనంతపురం	95
గోదావరి	127		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,06,970 ▲	98,050 ▲	1,37,000 ▲
విజయవాడ	1,09,000 ▲	1,03,000 ▲	1,26,700 ▲
విశాఖపట్నం	1,09,430 ▲	97,250 ▲	1,37,000 ▲
రాజమండ్రి	1,06,960 ▲	98,050 ▲	1,26,400 ▼
ప్రొద్దుటూరు	1,07,200 ▲	98,620 ▲	1,26,000 ▲
ముంబై	1,06,020 ▲	97,120 ▲	1,23,220 ▲

మారుతి కొత్త కారు విక్టోరిస్

న్యూఢిల్లీ: దేశంలో అతిపెద్ద కార్ల విక్రయ కంపెనీ మారుతి సుజుకీ ఇండియా తన స్పోర్ట్స్ యుటిలిటీ వెహికల్ (ఎస్‌యూవీ) పోర్ట్‌ఫోలియోను మరింత విస్తరించింది. ఈ విభాగంలో బ్రెజ్జా, ఫ్రాంక్స్, జిమ్నీ, గ్రాండ్ విటారా వంటి మోడళ్లను విక్రయిస్తున్న కంపెనీ.. విక్టోరిస్ పేరుతో మరో కాంపాక్ట్ ఎస్‌యూవీని బుధవారం ఆవిష్కరించింది. హ్యూండయ్ క్రెటా, కియా సెల్టోస్, హోండా ఎలివేట్, టయోటా హైరైడర్, టాటా కర్వ్, స్కోడా కుషాక్, ఫోక్స్‌వేగన్ టైగున్‌కు పోటీగా ఈ కారును మార్కెట్లోకి ప్రవేశపెడుతోంది. 1.5 లీటర్ పెట్రోల్, సీఎన్‌జీ, హైబ్రిడ్ ఇంజన్ ఆప్షన్లతో కూడిన ఈ కారును అరెనా షోరూమ్స్ ద్వారా విక్రయించనున్నట్లు కంపెనీ తెలిపింది. మొత్తం ఆరు వేరియంట్లు, పది రంగుల్లో లభించనున్న ఈ కారులో మారుతి పలు ఆధునిక ఫీచర్లను అందుబాటులోకి తెచ్చింది. రూ.11,000తో బుకింగ్ సౌకర్యాన్ని ప్రారంభించిన కంపెనీ.. కారు ధరను త్వరలోనే ప్రకటించనుంది. దీని ప్రారంభ ధర రూ.9.75 లక్షల స్థాయిలో ఉండవచ్చని అంచనా. భద్రతకు సంబంధించి ఈ కారుకు 5-స్టార్ భారత్ ఎన్‌క్యాప్ సేఫ్టీ రేటింగ్ లభించినట్లు సంస్థ తెలిపింది.

సెన్సెక్స్ 410 పాయింట్లు అప్

తొలుత తడబాటు.. ఆఖర్లో జోరు

ముంబై: స్టాక్ మార్కెట్ సూచీలు బుధవారం ట్రేడింగ్‌లో మధ్యాహ్నం వరకు లాభనష్టాల మధ్య ఊగిసలాడినప్పటికీ, ఆఖరి గంటలో భారీగా పుంజుకున్నాయి. దాంతో సెన్సెక్స్ 409.83 పాయింట్ల వృద్ధితో 80,567.71 వద్ద, నిఫ్టీ 135.45 పాయింట్ల పెరుగుదలతో 24,715.05 వద్ద ముగిశాయి. జీఎస్‌టీ మండలి సమావేశంలో తీసుకోబోయే నిర్ణయాలపై ఆశాభావంతోపాటు మెటల్ షేర్లలో ర్యాలీ ఇందుకు దోహదపడ్డాయి. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 21 రాణించాయి. టాటా స్టీల్ షేరు 5.90 శాతం ఎగబాకి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 0.90% శాతం, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.63% ఎగబాకాయి. రంగాలవారీ సూచీల్లో మెటల్ 3.08 శాతం పుంజుకోగా.. కమోడిటీస్, హెల్త్‌కేర్ ఒక శాతానికి పైగా పెరిగాయి. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు మరో రూ.1,666.46 కోట్ల నికర అమ్మకాలకు పాల్పడగా.. దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు నికరంగా రూ.2,495.33 కోట్ల కొనుగోళ్లు జరిపారు. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి ఆల్‌టైం కనిష్ఠ స్థాయి నుంచి కాస్త కోలుకుంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 9 పైసలు పెరిగి రూ.88.06 వద్ద ముగిసింది.

హైదరాబాద్-ఆమ్‌స్టర్‌డామ్ మధ్య డైరెక్ట్ విమాన సర్వీసు

కేఎల్‌ఎం రాయల్ డచ్ ఎయిర్‌లైన్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): నెదర్లాండ్ కేంద్రంగా పని చేసే కేఎల్‌ఎం రాయల్ డచ్ ఎయిర్‌లైన్స్ మన దేశంలో తన కార్యకలాపాలను మరింత విస్తరిస్తోంది. ఇందులో భాగంగా బుధవారం హైదరాబాద్ నుంచి నెదర్లాండ్స్ రాజధాని ఆమ్‌స్టర్‌డామ్‌కు డైరెక్ట్ విమాన సర్వీసులు ప్రారంభించింది. వారానికి మూడు రోజులు ఈ సర్వీసులు నడుస్తాయని కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మార్టెన్ స్టీనెన్ చెప్పారు. బెంగళూరు, ఢిల్లీ, ముంబై తర్వాత భారత్‌లో హైదరాబాద్ తమకు నాలుగో ప్రవేశ ద్వారమని తెలిపారు. ప్రస్తుతం ఈ నాలుగు నగరాల నుంచి ఆమ్‌స్టర్‌డామ్ వారానికి 24 విమాన సర్వీసులు నడుపుతోంది. వింటర్ సీజన్‌లో ఈ సర్వీసులను 27కు పెంచనున్నట్టు మార్టెన్ స్టీనెన్ చెప్పారు. ఫార్మా, ఐటీ కంపెనీలకు కేంద్రంగా ఎదిగిన హైదరాబాద్ నుంచి సరుకు రవాణాకు అద్భుత అవకాశం ఉందన్నారు. బోయింగ్ 777-200ఈఆర్ విమానాలతో ప్రారంభించిన హైదరాబాద్-అమెస్టర్‌డ్యామ్ విమాన సర్వీసులో వివిధ తరగతుల్లో 288 మంది ప్రయాణించ వచ్చని కేఎల్‌ఎం రాయల్ డచ్ ఎయిర్‌లైన్స్ అధికారులు చెప్పారు.

హైదరాబాద్‌లో యునిస్పేస్ మెగాస్టోర్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : నిర్మాణ, నిర్మాణ పరికరాల రంగంలోని అపర్ణా ఎంటర్‌ప్రైజెస్ (ఏఈఎల్) హైదరాబాద్‌లోని మియాపూర్‌లో యునిస్పేస్ మెగాస్టోర్‌ను ప్రారంభించింది. ఇది ఆసియాలోనే అతి పెద్ద స్టోర్ అని కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ అశ్విన్ రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. తమ రిటైల్ విస్తరణలో భాగంగా బెంగళూరు, ఢిల్లీ, ముంబై నగరాల్లో కూడా ఇదే తరహా స్టోర్లు ప్రారంభించాలనుకుంటున్నట్టు చెప్పారు. భవన నిర్మాణంలో ఉపయోగించే 20 రకాల వస్తువులకు ఇది వన్ స్టాప్ సొల్యూషన్‌గా ఉంటుందని కంపెనీ వైస్ ప్రెసిడెంట్ శ్రేయాస్ త్రివేది వెల్లడించారు. కస్టమర్లకు ఇంటి డిజైన్, నిర్మాణం, ఆధునీకరణ వంటి సేవలన్నీ ఒకే ఛత్రం కింద అందించాలన్నది తమ కాన్సెప్ట్ అని ఆయన చెప్పారు. ఇది కస్టమర్లకు సరికొత్త అనుభూతిని అందిస్తుందని ఆయన అన్నారు.



యూరియా కష్టాలు తీరేదెప్పుడో..?

- ఆందోళన బాట పట్టిన రైతులు
- రోజుకోచోట వెల్లువెత్తుతున్న నిరసనలు
- సరిపడా నిల్వలు ఉన్నాయంటున్న అధికారులు

మంచిర్యాల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూరియా కోసం నిరసనలు రోజురోజుకూ తీవ్రతరం అవుతున్నాయి. నిత్యం ఎక్కడో ఒకచోట యూరియా ఇవ్వాలంటూ రైతులు ఆందోళనలు చేస్తూనే ఉన్నారు. వానాకాలం సీజన్‌లో వరిసాగుకు సరిపడా నిల్వలు ఉన్నాయని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. అధికారులు చెబుతున్న ప్రకారం జిల్లాలో సాగుకు సరిపడా నిల్వలు అందుబాటులో ఉంటే రైతులు నిరసనలబాట ఎందుకు పడుతున్నారో అంతు చిక్కని ప్రశ్నగా మిగిలింది. వ్యవసాయశాఖ అధికారులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టడంతో యాసంగి సీజన్‌లో యూరియా కొరత తలెత్తలేదు. మార్క్‌ఫెడ్‌తో పాటు ప్రైవేటు మార్కెట్‌లోనూ యూరియా నిల్వలు సరిపడా అందుబాటులో ఉండటంతో ఎక్కడ కూడా రైతులు నిరసనలు తెలిపిన దాఖలాలు లేవు. ఇదిలా ఉంటే వానాకాలం సీజన్‌కు సంబంధించి వ్యవసాయ శాఖ సాగు ప్రణాళిక రూపొందించినప్పటికీ యూరియా కొరతతో ఆందోళనలు సాగుతుండటం గమనార్హం.

● జిల్లాలో

మూడు లక్షల ఎకరాల్లో సాగు...

2024-25 వానాకాలం సీజన్‌కు సంబంధించి జిల్లాలో మూడు లక్షల 18వేల788 ఎకరాల్లో వరి, పత్తి, మొక్కజొన్న, ఇతర పంటలు సాగు చేస్తున్నారు



చెన్నూరులో యూరియా కోసం చెప్పులను క్యూ లైన్లో ఉంచిన రైతులు (ఫైల్)

● సకాలంలో సరఫరా కాకపోవడంతోనే...

జిల్లాలోని వానాకాలం సాగుకు సరిపడా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని సంబంధిత అధికారులు చెబుతున్నప్పటికీ సకాలంలో అందకపోవడంతోనే రైతులు ఆందోళనబాట పడుతున్నట్లు తెలుస్తోంది. స్టాకు వచ్చినప్పుడల్లా ఒకటి, రెండు బస్తాలచొప్పున అందిస్తుండటంతో ప్రాథమిక వ్యవసాయకేంద్రాల వద్ద రైతులు బారులు తీరుతున్నారు. క్యూ లైన్లలో నిలబడే ఓపికలేక తమకు బదులు చెప్పులను ఉంచుతున్నారు. అలా తమ వంతు వచ్చే వరకు కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. ఓపిక నశించి రోడ్లపైకి చేరి ఆందోళనలకు దిగుతున్నారు. వానాకాలం సాగుకు అవసరమైన యూరియా మొత్తం ఒక్కసారే సరఫరా చేస్తే పలుమార్లు సెంటర్లకు వెళ్లి గంటల తరబడి నిరీక్షించే అవసరం వచ్చేది కాదని రైతులు ఆవేదన చెందుతున్నారు. యూరియా విడుతల వారీగా సరఫరా అవుతుండటంతో తమ సాగుకు సరిపడా ఇస్తారో...లేదోనన్న సందేహంతో కొందరు రైతులు అవసరం ఉన్న దానికంటే అధికంగా ఒకేసారి తీసుకుంటున్నట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో కొరత ఏర్పడుతున్నట్లు భావిస్తున్నారు. వానాకాలం సాగు పూర్తయ్యేసరికి యూరియా పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచుతామని, రైతులు ఓపికతో ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

● ఎరువుల అవసరం ఇలా..

వానాకాలం సీజన్‌కు సంబంధించి పంట సాగు కోసం 28,506 మెట్రిక్ టన్నుల యూరియా అవ సరం కాగా, 9,082 మెట్రిక్ టన్నుల డీఏపీ, 1,740 మెట్రిక్ టన్నుల ఎస్ఎస్‌పీ, 2,245 మెట్రిక్ టన్నుల ఎంవోపీ, 36,500 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ అవసరం ఉంటుంది. ఇప్పటి వరకు 20,222 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు చేరింది. బుధవారం నాటికి మరో263 మెట్రిక్ టన్నులు జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ కేంద్రాలు, డీలర్ల వద్ద అందుబాటులో ఉంది. ఇంకా ఈ సీజన్‌లో ఇప్పటి వరకు మరో 2,995 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండనుంది. విడతల వారీగా జిల్లాకు యూరియా సరఫరా అవుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.

రెగ్యులర్ ప్రిన్సిపాల్‌ను నియమించాలి

లక్షెట్టిపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట మోడల్ డిగ్రీ కళాశాలలో రెగ్యులర్ ప్రిన్సిపాల్‌ను నియమించాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ఓ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి ప్రభంజనం మాట్లాడుతూ రెగ్యులర్ ప్రిన్సిపల్ లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే రెగ్యులర్ ప్రిన్సిపాల్‌ను కేటాయించాలని కోరారు.

పారిశుధ్య పనులను చేపట్టాలి

తాండూర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ రోజు గ్రామాల్లో పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టాలని మండల పంచాయతీ అధికారి అనిల్‌కుమార్ సూచించారు. బుధవారం నర్సాపూర్ గ్రామంలో పర్యటించి పారిశుధ్య పనులను, పంచాయతీ రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది ఉన్నారు.

అడవిని నరకడం నేరం

జన్నారం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అటవీ భూమిని ఆక్రమించడం, చెట్లను నరకడం చట్టరీత్యానేరమని లక్షెట్టిపేట సీఐ రమణమూర్తి, ఎస్ఐ అనూష, లింగంపల్లి ఎఫ్ఆర్‌వో శ్రీధరాచారి అన్నారు. జన్నారం అటవీ డివిజన్‌లో గల పాలగోరి అటవీ ప్రాంతంలో మంగళవారం అర్ధరాత్రి ఆదిలాబాద్ జిల్లాలోని నేతూర్, లింగాపూర్, జైనూర్ మండలాలకు చెందిన సుమారు 60 మంది 52 చెట్లను అక్రమంగా నరికి డ్యూటి లో ఉన్న 14 మంది అటవీ అధికారులను బెదిరించి గుడిసెలు వేసుకున్నారు. దీంతో బుధవారం ఆదివాసీ గిరిజనులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అటవీ భూమిని ఆక్రమించడం, చెట్లను నరకడం చట్టరీత్యానేరమన్నారు. అధికారులకు అర్జీలు పెట్టుకోవాలి తప్ప దాడులు చేయవద్దని తెలిపారు.

విద్యా విధానంలో మార్పులు అవసరం

నస్పూర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా విద్యా విధానంలో మార్పుల పై ఉపాధ్యాయులు నూతన విద్యావిధానంపై దృష్టి సారించాలని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత నరేందర్‌రెడ్డి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని నస్పూర్ పట్టణం సీసీసీలో ఓ ఫంక్షన్ హాల్‌లో బుధవారం జిల్లాలకు చెందిన ఉపాధ్యాయులను ట్రస్మా ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి, ఎంఈవో పద్మజా, ట్రస్మా రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ మల్లెత్తుల రాజేంద్రపాణి, జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ జ్యోతి ప్రజ్వలన చేశారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ 2026-27 విద్యా సంవత్సరంలో విద్యా విధానంలో కొత్త విద్యా పాలసీ రానుందని, ఫలితంగా అనేక మార్పులు చోటు చేసుకోవచ్చన్నారు. అనంతరం జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 78 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి ప్రశంసాపత్రాలను అందించారు. కార్యక్రమంలో ట్రస్మా నాయకులు శ్యాంసుందర్‌రెడ్డి, రజని, అమన్‌ప్రసాద్, రేగళ్ల ఉపేందర్, షైదం రామకృష్ణ, రాజ్‌కుమార్, బత్తిని దేవన్న, పెట్టం మల్లయ్య, కృష్ణారెడ్డి, వివిధ పాఠశాలలకు చెందిన కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న సత్కరిస్తున్న ఎంఈవో పద్మజ, అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి, ట్రస్మా నాయకులు

యూరియా కోసం రైతులు ఆందోళన చెందవద్దు

లక్షెట్టిపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల నియోజకవర్గంలోని రైతులు యూరియా కోసం ఆందోళన చెందవద్దని లక్షెట్టిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రేమ్ చంద్ అన్నారు. బుధవారం ఆయన పట్టణంలోని ఐబీలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యం లో నాయకులు రైతులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు హైదరాబాద్ నుంచి వీడియోకాల్ ద్వారా మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు రైతులను భయపెట్టిందుకు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. తాను కాస్త ఆరోగ్యం సహకరించకక ఫోన్‌లో మాట్లాడుతున్నానని, నియోజకవర్గ ప్రజలు, రైతుల సంతోషమే తనకు ముఖ్యం అన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండీ ఆరీఫ్, మండల అధ్యక్షుడు పింగిళి రమేష్, మాజీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ చెల్ల నాగభూషణం, జిల్లా ఆర్జీపీఎస్ అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి, జిల్లా ఉపాధ్యక్షుడు చింత అశోక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నలిమెల రాజు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొప్పు సుమన్, డీసీసీ అధికార ప్రతినిధి పూర్ణచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



వీడియోకాల్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

● కలెక్టర్‌ను కలిసిన నాయకులు

కలెక్టర్ కుమార్ దీపక్‌ను దండేపల్లి, హాజీపూర్, లక్షెట్టిపేట మండలాల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు బుధవారం రోజు మర్యాదపూర్వకంగా కలిశారు. మూడు మండలాల రైతులకు యూరియా పూర్తి స్థాయిలో సరఫరా చేయాలని కోరారు. కలెక్టర్ ను కలిసిన వారిలో మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రేమ్ చంద్, వైస్ చైర్మన్ ఎండీ ఆరీఫ్, పింగిళి రమేష్, బొప్పు సుమన్, పూర్ణచందర్‌రావు, శ్రీనివాస్‌రావు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

మంచిర్యాలక్రైం: లయన్స్‌క్లబ్ మంచిర్యాల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రేకుర్తి ఐ ఆసుపత్రిలో 30 మందికి ఉచిత కంటి శస్త్ర చికిత్స నిర్వహించినట్లు లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఐక్యాంప్ లయన్స్ మధుసూదన్ రెడ్డి తెలిపారు.

● ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటీస్‌షిప్ మేళాను 8 వ తేదీ నిర్వహిస్తున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ రమేశ్ తెలిపారు.

● కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్ పేరుతో బీసీలను మోసం చేస్తోందని బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్ ఒక ప్రకటనలో విమర్శించారు.

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌లోని సాయిదృష్టి అంధుల పాఠశాల, వృద్ధాశ్రమంలో ఉన్న 25 మంది వృద్ధులు, పిల్లలకు ముత్యాల సాయికృష్ణ అనే ఆర్మీ ఉద్యోగి నూతన వస్త్రాలు కొనుగోలు చేసి అందించారు.

జన్నారం: రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన బీసీ రిజర్వేషన్ బిల్లును గవర్నర్ వెంటనే ఆమోదించాలని బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం రాష్ట్ర సీనియర్ నాయకులు పోదూరి చంద్రయ్య కోరారు.

జైపూర్: సింగరేణి వైద్యుల బదిలీల్లో భాగంగా ఎస్టీపీపీ డిస్పెన్సరీలో పనిచేస్తున్న మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె. రవీందర్, డాక్టర్ శ్యామలలు రామగుండం ఏరియా ఆసుపత్రికి బదిలీ కాగా వారిని ఎస్టీపీపీ అధికారులు సన్మానించారు. ఈ కార్యక్రమానికి ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి, జీఎం శ్రీనివాసులు హాజరై మాట్లాడారు.

కాసిపేట: ఉపాధ్యాయ వృత్తిలో రాణించి ప్రత్యేక గుర్తింపు పొందడం వృత్తికే గర్వకారణమని మంచిర్యాల డీటీడీవో జనార్దన్ అన్నారు. బుధవారం మల్కేపల్లి కాంప్లెక్స్‌లో నిర్వహించిన టీడబ్ల్యూపీఎస్ పెద్దాపూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మంగ నారాయణ పదవీ విరమణ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు.

● గత నెల 30, 31 తేదీల్లో కర్ణాటక రాష్ట్రంలోని కోరమంగళ లో జరిగిన 4వ సౌత్ ఇండియన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో దేవాపూర్‌కు చెందిన ఇంటర్ విద్యార్థిని ఆడెపు చందన మెరుగైన ప్రతిభ కనబర్చి బ్రాంజ్ మెడల్ సాధించింది.

కోటపల్లి: మండలంలోని లింగన్నపేట మంచిర్యాల కమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో పమిడిముక్కల పూర్ణచంద్రరావు స్మారకార్థం వారి కుటుంబీకులు నాగమణి, నిఖిత పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు.

గణపతి నిమజ్జనాన్ని శాంతియుతంగా జరపాలి

చెన్నూరు/జైపూర్ సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : గణపతి నిమజ్జనాన్ని చెన్నూరు పట్టణ ప్రజలు శాంతియుతంగా నిర్వహించుకోవాలని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు కోరారు. గురువారం జరగబోయే గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. కొత్త బస్టాండ్‌నుంచి పెద్ద చెరువు వరకున్న రహదారిని బుధవారం పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట సీఐ దేవేందర్‌రావు, ఎస్ఐ సుబ్బారావు, మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ ఉన్నారు. జైపూర్ మండలంలోని ఇందారం వద్ద గోదావరి నది బ్రిడ్జి వద్ద నిమజ్జన ఏర్పాట్లను శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్‌తో కలిసి ఏసీపీ వెంకటేశ్వర్ పరిశీలించారు.

జన్నారం: మండల కేంద్రంలోని పొన్కల్, జన్నారం గణేష్ నిమజ్జన స్థలాలను డీపీవో వెంకటేశ్వర్‌రావు పరిశీలించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.



చెన్నూరులో నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏసీపీ వెంకటేశ్వర్లు

● డీజేలకు అనుమతి లేదు..

తాండూర్: తాండూర్ పోలీస్‌స్టేషన్‌పరిధిలో గురు, శుక్రవారాల్లో నిర్వహించే గణేష్ నిమజ్జన వేడుకల్లో డీజే సౌండ్ సిస్టంకు అనుమతులు లేవని తాండూర్ ఎస్ఐ కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రత్యేక పూజలు..అన్నదానాలు

నస్పూర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ పట్టణం టీఎన్‌జీవోస్ హౌసింగ్ సొసైటీ కాలనీలో సిద్ధి వినాయక మండలి వద్ద బుధవారం లక్ష్మి గణపతి హోమం నిర్వహించారు. పూజ కార్యక్రమంలో అధ్యక్షుడు శ్రీహరి, గుండేటి యోగేశ్వర్‌లతో పాటు కాలనీకి చెందిన హౌసింగ్ సొసైటీ పలువురు సభ్యులు కుటుంబ సమేతంగా హోమంలో పాల్గొన్నారు. నస్పూర్ పట్టణం హౌసింగ్ బోర్డు కాలనీలోని లక్ష్మీగణపతి ఆలయంలో బుధవారం సిద్ధి బుద్ధి వినాయక కల్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది.

బెల్లంపల్లి: పట్టణంలోని వినాయక చవితికి కొలువుదీరిన గణనాథులకు భక్తులుప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు మండపాల వద్ద మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

దండేపల్లి: దండేపల్లిలో బాల గణేష్ యూత్ వినాయక మండపం వద్ద మహిళలు కుంకుమ పూజలు చేశారు. గణపతికి 108 నైవేద్యాలను సమర్పించారు.

కన్నెపల్లి: మండల కేంద్రంలోని సాయి గణేష్ మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో ,జన్కాపూర్ గ్రామంలోని అభయాంజనేస్వామి ఆలయంలోని గణనాథుని వద్ద కుంకుమ పూజ నిర్వహించారు.

మందమర్రిటౌన్: పట్టణంలోని యాపల్ ఏరియా గణేష్ మిత్రమండలి ఆధ్వర్యంలో మందమర్రి ఎస్ఐ రాజశేఖర్ దంపతులు పాల్గొని హోమం నిర్వహించారు.

భీమారం: భీమారం మండల కేంద్రంలోని రావిచెట్టు కాలనీలోని సాయిరాం యూత్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుని మండపం వద్ద బుధవారం లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు.

మందమర్రిరూరల్: మండలంలోని బాల వరసిద్ది వినాయక మండలి వద్ద బుధవారం రాత్రి మహిళలు 101 దీపాలను వెలిగించి దీపారాధన చేశారు.

● నిబంధనలు పాటించాలి

మందమర్రిటౌన్: గణపతి నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా నిర్వాహకులు నిబంధనలు పాటించాలని మందమర్రి మున్సిపల్ కమిషనర్ రాజలింగు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని డబుల్‌బెడ్‌రూం బతుకమ్మ ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపంలో కమిషనర్ పూజలు నిర్వహించారు.

వినాయకుడి దీవెనలు ప్రజలందరిపై ఉండాలి

మంచిర్యాల కలెక్టరేట్: ఆది దేవుడు గణనాథుని దీవెనలు ప్రజలందరిపై ఉండాలని గిరిజన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నైతం కృష్ణ్ ఆకాంక్షించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని గౌతమినగర్‌లో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో గణనాథుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మోతె పోచయ్య, దొబ్బల సత్తయ్య, జెట్టి పోచయ్య, రాజమల్లు, చింతల మధు, సంతోష్ తదితరులుపాల్గొన్నారు.



పూజలు చేస్తున్న నైతం లక్ష్మణ్, తదితరులు

రహదారులకు మరమ్మతులు చేయించాలి

బెల్లంపల్లి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రహదారులు గుంతలు ఏర్పడి వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారని వెంటనే మరమ్మతులు చేయించాలని కోరుతూ బుధవారం సీపీఎం నాయకులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. అధికారులు రహదారులకు మరమ్మత్తులు చేపట్టి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి రవి, నాయకులు ఉన్నారు.

ముగిసిన ఆర్టీసీ కానిస్టేబుల్స్ శిక్షణ

హాజీపూర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గుడిపేట 13వ బెటాలియన్‌లో ఆర్టీసీ కానిస్టేబుళ్లకు శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. ఈ శిక్షణలో భాగంగా ఆర్టీసీ కానిస్టేబుళ్లకు లా, డ్రిల్, క్రమశిక్షణతో పాటు సెక్యూరిటీ అంశాలపై ట్రైనింగ్ ఇచ్చారు. వీడ్కోలు కార్యక్రమంలో బెటాలియన్ కమాండెంట్ పి. వెంకటరాములు, అసిస్టెంట్ కమాండెంట్ బాలయ్య, ట్రైనింగ్ రిజర్వు ఇన్‌స్పెక్టర్ భాస్కర్, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

దండేపల్లి సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్ఎంవీఆర్(స్వచ్ఛత, మెరుగుదల, విశ్వసనీయత, బాధ్యత)పై మండలస్థాయి ఎయిడెడ్ ప్రధానోపాధ్యాయులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా సెక్టోరియల్ అధికారి చౌదరి మాట్లాడుతూ స్వచ్ఛ పాఠశాల రేటింగ్ ద్వారా పాఠశాల బలోపేతంతో పాటు పాఠశాలల స్థితిగతులు మెరుగుదల అవుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారి సత్యనారాయణమూర్తి, జిల్లా బాలికల అధికారి శాఖ అధికారిణి విజయలక్ష్మి, ఎంఈవో దుర్గం చిన్నయ్య, ఆయా పాఠశాలల హెచ్ఎంలు రాజేశ్వర్‌రావు, రాజు, చిన్న నరసయ్య, సుదర్శన్, ఆర్పీలు కృష్ణమూర్తి, లక్ష్మణాచారి పాల్గొన్నారు.

జన్నారం: మండలంలోని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు ఎంఈవో విజయ్‌కుమార్ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎస్‌హెచ్‌వీఆర్ అనే మొబైల్ యాప్ నందు ప్రతి పాఠశాలలో రేటింగ్ వస్తుందని దీని ఆధారంగా జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి పాఠశాలలను ఎంపిక చేస్తారన్నారు. ఎంపిక చేసిన పాఠశాలకు నగదుతో పాటు ప్రశంసాపత్రాలు అందజేస్తారన్నారు. కార్యక్రమంలో డీఆర్‌పీలు గోపాల్, మధూకర్ సీఆర్‌పీలు శేఖర్, దయాకర్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

7న గూడెంగుట్ట సత్యదేవుడి ఆలయం మూసివేత

దండేపల్లి సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయాన్ని చంద్రగ్రహణం సందర్భంగా ఈనెల 7వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు గూడెం సత్యదేవుడి ఆలయాన్ని మూసివేస్తున్నట్లు ఆలయ కార్యనిహణాధికారి సంకటాల శ్రీనివాస్ ఒక ప్రకటలో తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 12 గంటలలోపు సత్యదేవుడి దర్శనం, ఉదయం 9:30 గంటలకు ఒకటో బ్యాచ్ వారికి మాత్రమే సామూహిక వ్రతాలు నిర్వహించనున్నారు. 12 గంటల తర్వాత స్వామి వారి మహానివేదన అనంతరం ఆలయాన్ని మూసివేస్తారు. తిరిగి ఈనెల ఎనిమిదో తేదీ సోమవారం ఉదయం ఐదు గంటలకు ఆలయంలో సంప్రోక్షణ నిర్వహించనున్నారు. అనంతరం ఉదయం 9:30 గంటల నుంచి ఆలయంలో భక్తులకు దర్శనానికి అనుమతించనున్నట్లు ఈవో తెలిపారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



పట్టణంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న యుఎస్ఎఫ్ఐ నాయకులు

లక్షెట్టిపేట, సెప్టెంబర్, 3(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యల పరిష్కారం యుఎస్ఎఫ్ఐ(భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్)కి మాత్రమే సాధ్యమని, రాష్ట్ర ప్రభుత్వ సమస్యలను వెంటనే పరిష్కరించాలని యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రవి అన్నారు. లక్షెట్టిపేట పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో బుధవారం ఏర్పాటు చేసిన ప్రథమ మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని లేదంటే ప్రజాభవన్ ముట్టడిస్తామని హెచ్చరించారు. అంతకు ముందు ఐదు వందల మంది విద్యార్థులతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధానకార్యదర్శి మాదం తిరుపతి, జిల్లా అధ్యక్షుడు మల్లేష్, జిల్లా కార్యదర్శి మిట్టపెల్లి తిరుపతి పాల్గొన్నారు.

శబరిమల అయ్యప్ప ఆలయంలో రాజకీయ జోక్యం సరికాదు

శ్రీరాంపూర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): శబరిమల అయ్యప్ప స్వామి దేవాలయం నిర్వహణ, వేడుకల ఏర్పాట్లలో రాజకీయ జోక్యం సరికాదని అఖిల భారత అయ్యప్ప ధర్మప్రచార సభ(ఏబీఏపీ) జాతీయ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు అయ్యప్పదాసు, బేతి తిరుమలరావు ఒక ప్రకటనలో కోరారు. అయ్యప్ప స్వామిపై భక్తుల విశ్వాసాన్ని రాజకీయాలతో ముడిపెట్టవద్దని వారు పేర్కొన్నారు. కేరళ ప్రభుత్వం, ట్రావెన్ కోర్ దేవస్థానం బోర్డు ఆధ్వర్యంలో గ్లోబల్ అయ్యప్ప స్వాముల సంగమం నిర్వహించడానికి నిర్ణయించడం స్వాగతించదగిన విషయమన్నారు.

సామూహిక వివాహాలకు దరఖాస్తు చేసుకోవాలి

బెల్లంపల్లి,సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): తిలక్‌గ్రౌండ్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అక్టోబరు 26వ తేదీన ఉచిత సామూహిక వివాహ మహోత్సవాలను నిర్వహిస్తున్నామని తిలక్‌గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. బుధవారం పట్టణంలో సామూహిక వివాహక మహత్సోవ పోస్టర్లను విడుదల చేసి మాట్లాడారు. ఉచిత సామూహిక వివాహాల కోసం యువతి, యువకులు అక్టోబర్ 1 నుంచి రిజిస్ట్రేసన్ చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు రత్నం రాజన్న, రంగ రామన్న, నాగేశ్‌కుమార్, జయరాంయాదవ్, వేణు, వెంకటరాజం, రాజయ్య, లక్ష్మణ్ పాల్గొన్నారు.

మైక్రో బ్రేవరీలకు దరఖాస్తు చేసుకోవాలి

మంచిర్యాలక్రైం, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మైక్రోబ్రేవరీల ఏర్పాటుకు కమిషనర్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ద్వారా నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఎక్సైజ్ సీఐ గురువయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29 తేదీలోపు డిప్యూటీ కమిషనర్ ప్రొహిబీషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ ఆదిలాబాద్ కార్యాలయం పేరు మీద లక్ష రూపాయల చలాన్ తీయాలన్నారు. దరఖాస్తు చేసుకోవాల్సిన అభ్యర్థులు అప్లికేషన్ ఫారం ఎంబీ1ఏ స్వీయ ధ్రువీకరణ చేసిన ఆధార్‌కార్డు, కంపెనీ, పార్ట్‌నర్‌షిప్ ఫర్మ్ రిజిస్ట్రేషన్ ప్రతినిది సమర్పించాలని తెలిపారు.

కూరగాయల సాగుపై రైతులకు అవగాహన

హాజీపూర్,సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సింగాపూర్‌లో ఉద్యానశాఖ అధికారులు కూరగాయల పంటసాగుపై బుధవారం అవగాహన కల్పించారు. ఉద్యావనశాఖ అధికారి సహజ కూరగాయల సాగులో చీడపీడల నివారణ, సస్యరక్షణ చర్యలపై రైతులకు వివరించారు. అనంతరం పామాయిల్ సాగుచేస్తున్న రైతు రాజేశ్వర్‌రెడ్డి క్షేత్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి క్రిష్ణ, ఉద్యాన విస్తరణ అధికారి శేఖర్, ఏఈవో ప్రసన్న, అభ్యుదయ రైతు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

తాండూర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ 42 శాతం అమలు చేసినందుకు తాండూర్ మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి, బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్ చిత్రపటాలకు బుధవారం కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. వందేభారత్ రైలును మంచిర్యాలలో ఆగేలా చేసిన ఎంపీ గడ్డం వంశీకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్‌రావు, మురళీధర్‌రావు, ఎండీ ఈసా, సిరంగి శంకర్, రవీందర్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

కాసిపేట, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ కాంగ్రెస్‌ప్రభుత్వం ఇచ్చిన హామీమేరకు వాల్మీకి బోయ కులస్తులను వెంటనే ఎస్టీ జాబితాలోచేర్చాలని వాల్మీకి బోయ ఎస్టీ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు గొంది వెంకటరమణ అన్నారు. బుధవారం కాసిపేట ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సమావేశంలో వాల్మీకి బోయ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పంట నష్టంపై అధికారులు సర్వే



చిన్నతిమ్మాపూర్‌లో నష్టపోయిన పంటలను పరిశీలిస్తున్న ఏఈవోలు

చెన్నూరు/తాండూర్/జైపూర్/భీమిని సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను చెన్నూర్, తాండూర్, జైపూర్, భీమిని మండలంలో అధికారులు బుధవారం సర్వే నిర్వహించారు. అనంతరం నివేదికలను ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు. ఏఈవోలు శంకర్, వెంకటేష్, ధనలక్ష్మి, మార్క్ గ్లాడ్‌స్టన్ జంబుల కార్తీక్, అఫ్రోజ్, రైతులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కృషి చేయాలి

చెన్నూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ సూచించారు. బుధవారం పట్టణంలోని సాయిరాం ఫంక్షన్‌హాలులో చెన్నూరు రూరల్, కోటపల్లి, వేమనపల్లి మండలాల నాయకులు, కార్యకర్తలతో ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ పార్టీ బలంగా ఉందని, ఎన్నికల్లో గెలిచిన సత్తా చాటాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోడి రమేష్, కార్యదర్శి రత్న లక్ష్మీనారాయణ,నాయకులు సమ్మయ్య, రాజశేఖర్ గౌడ్, మధుకర్, శ్రీపాల్, చందు, తిరుపతి, శ్రీనివాస్, శివకృష్ణ, నర్సింహులు, శంకర్, వెంకన్న, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

రామకృష్ణాపూర్, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీనివాస్‌నగర్‌కు చెందిన కుశ్నపల్లి నవీన్(33) ఆర్థిక ఇబ్బందులతో బుధవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఒక ప్రైవేట్ పాఠశాలలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న నవీన్ కొంత కాలంగా ఆర్థిక సమస్యలతో బాధపడుతున్నాడు. మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరు లేని సమయంలో ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.